

సచివాలయ తప్పుతోంది

నలభై ఏళ్ల క్రితం పరిపాలనను ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లడానికి మండల వ్యవస్థను ప్రవేశపెట్టారు. 2019లో పరిపాలనను గ్రామస్థాయికి చేర్చాలన్న సదుద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లాలోని సచివాలయాల్లో పాలన గాడి తప్పుతోంది. ఉద్యోగులు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించింది. సచివాలయ వ్యవస్థ పర్యవేక్షణకు ప్రభుత్వం మండల స్థాయిలో ప్రత్యేకంగా 25 డిప్యూటీ ఎంపీడీవోలను నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగుల సర్దుబాటు కోసం సచివాలయాలను ఏ, బీ, సీలుగా వర్గీకరించింది. అయినా కొన్ని చోట్ల తీరు మారలేదు.

- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఉద్యోగులు
- మండలాలకు పరిమితమైన వీఆర్వోలు
- పర్యవేక్షించని ఉన్నతాధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సమయ పాలన లేకుండా విధులకు హాజరు అవుతున్నారు. ఉదయం 10 గంటలకు రావాల్సిన సచివాలయ ఉద్యోగులు ఉదయం 11.30 గంటలకు విధులకు వస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లిన ప్రజలు కుల, ఆదాయ, జనన మరణ సర్టిఫికెట్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు సచివాలయాల్లో తనిఖీలు చేయకపోవడంతో ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజా సంఘాలు, ప్రజలు ఆరోపిస్తున్నారు.



ప్రతి గ్రామంలో

సచివాలయాలు ఏర్పాటు అయ్యాక ప్రతి గ్రామంలో ఓకార్యాలయం, 10శాఖలకు సంబంధించిన ఉద్యోగులు, ప్రజల గడప వద్దకు సేవలు, ఆనాడు అది ఓ రంగుల కల. వైసీపీ ప్రభుత్వంలోనే సచివాలయాల వ్యవస్థ గాడితప్పింది. పింఛన్ల మంజూరు కోసం వలంటరీలు ప్రజల వద్ద పైసలు వసూల్ చేశారు. నాటి నుంచి నేటి వరకు గ్రామ, వార్డు సచివాలయాల ను తనిఖీలు చేసే అధికారులు లేకపోవడంతో సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీల సంఖ్య ప్రతి వారం పెరుగుతోంది.

సమావేశాలు ఉన్నాయని చెబుతూ..

జిల్లాలో పనిచేసే అనేకమంది వీఆర్వోలు మండల కార్యాలయాలకి పరిమితమయ్యారు. ఉదయం 11:30గంటలకు వీఆర్వోలు విధులకు హాజరవుతున్నారు. ప్రతి సచివాలయానికి ఉదయం 10గంటలకు హాజరు కావాల్సిన వీఆర్వోలు, డైరెక్టుగా మండల కార్యాలయానికి వెళ్తున్నారు. ప్రజలు ఫోన్ చేస్తే తహసీల్దార్, డీటీ, ఆర్ఐతో సమావేశాలున్నాయని వీఆర్వోలు చెప్పడం గమనార్హం. ప్రజలకు సేవ చేయాల్సిన ఉద్యోగులు పనివేళలు తప్పించుకుని తిరగడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో వాటా ఉండటంతో వాటి సేవలను పరిష్కరించి, సచివాలయ దరఖాస్తులను తిరస్కరణకు గురిచేయడంతో వీఆర్వోలు తమ పనిలో సఫలీకృతమయ్యారు. కనీసం ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు అయినా సచివాలయంలో వీఆర్వోలు అందుబాటులో ఉంటే అన్ని సమస్యలకు పరిష్కారం అవుతాయని గ్రామ, వార్డు ప్రజలు అంటున్నారు.

ఎక్కడి నుంచైనా బయో మెట్రిక్..



గత ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక సర్వేయర్‌ను నియమించింది. ఆ తర్వాత అగ్రికల్చర్ రీసర్వే మొదలు కావడంతో సర్వేయర్లను రంగంలోకి దింపింది. వారు ఎక్కడి నుంచైనా బయోమెట్రిక్ హాజరు నమోదుచేసే అవకాశం కల్పించడంతో వారు సచివాలయాలకు వీడ్కోలు చెప్పారు. ఇక గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు ఎనర్జీ అసిస్టెంట్ ఉండేవారు. సచివాలయ సిబ్బంది జీత భత్యాలు, పంచాయతీ కార్యదర్శుల చేతిలో ఉండేవి. ఎనర్జీ అసిస్టెంట్ జీతం మాత్రం వారి మాతృ శాఖ ఇచ్చేది. దీంతో వారు సచివాలయానికి శుభం కార్డు వేశారు.

డిప్యూటీ ఎంపీడీవోల నియామకం

సచివాలయ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం మండల స్థాయిలో ప్రత్యేకంగా 25 డిప్యూటీ ఎంపీడీవోలను నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగుల సర్దుబాటు కోసం సచివాలయాలను ఏ, బీ, సీలుగా వర్గీకరించింది. అయినప్పటికీ కొన్నిచోట్ల తీరు మారలేదు. నగరాల్లో నోడల్ అధికారులను నియమించింది. వీరు సచివాలయ ఉద్యోగులపై పర్యవేక్షించింది. వీరి ఆగమనంతోనైనా సచివాలయ ఉద్యోగుల మెడలో గంట కడతారేమోననే ఓఆశ జనాల్లో నెలకొంది.

మహిళా పోలీసు కొలువు..

సచివాలయం ఏర్పాటైన నాటినుంచి సరైన జాబ్ చార్ట్ లేక, విధులు కేటాయించక విలువైన మానవ వనరులు వృథా అయిన కొలువు మహిళా పోలీసు. అనంతరం ఈకొలువు పేరును గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శిగా మార్చినప్పటికీ వీరి విషయంలో ఏమీ చేయాలో ఎవరి వద్ద స్పష్టమైన సమాధానం లేదు. పోలీసు ఉద్యోగానికి కావాల్సిన శారీరక దారుఢ్య అర్హతలు వీరికి లేవు. వీరిని ఏ శాఖకు కేటాయించాలన్న సందిగ్ధత ఇప్పటికీ నెలకొని ఉంది. ఇది విధి నిర్వహణ లేని కొలువుగా మిగిలిపోయింది.

బీఎల్వోలుగా నియామకం..

సచివాలయ ఉద్యోగులు వచ్చాక ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం చేస్తూ వారిలో మెజార్టీ సిబ్బందిని బూత్ లెవెల్ అధికారులుగా (బీఎల్వో) నియమించారు. తమకు బీఎల్వో డ్యూటీ ఉందని సిబ్బంది సచివాలయానికి హాజరు కావడం తగ్గించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా ట్యాంకులను పరిశుభ్ర పరచడం, మురుగు కాలువల నిర్వహణ బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ది. వారు ఈ పనులు పంచాయతీ కార్యదర్శులకు సంబంధించినవి అంటూ తప్పించుకుంటున్నారు.

డిప్యుటేషన్‌లో ఉద్యోగులు

డివిజనల్ స్థాయిలో డివిజన్ అభివృద్ధి అధికారులను గత ప్రభుత్వం నియమించింది. ఈ కార్యాలయానికి సిబ్బందిని కేటాయించక ఇబ్బందిని మిగిల్చింది. ఆయా అధికారులు 10 మందికి పైగా సచివాలయ సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకున్నారు. దీంతో సచివాలయాల్లో సేవలు అందించే వారు లేక అవి వెలవెలబోయాయి. జిల్లా పంచాయతీ, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు కూడా సచివాలయ సిబ్బందిని తీసుకున్నాయి. సచివాలయ సేవలు లభించక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ప్రభుత్వ నిబంధనలు సచివాలయ ఉద్యోగులు పాటించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం. వారు ప్రజలకు అందుబాటులో ఉండాలి. గ్రామ, వార్డు సచివాలయ పర్యవేక్షణ అధికారులు తనిఖీలు చేయాలి.

- నూరుల్ ఖమర్, జేసీ, కర్నూలు

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో అన్ని యాజమాన్య ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో పని చేసేందుకు వంద మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తూ రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయ రామరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8వ తేదీ నుంచి 2026 మే 7వ తేదీ వరకు వీరు విధులు నిర్వహిస్తారు. స్కూల్ అసిస్టెంట్లకు నెలకు ఒక్కొక్కరికి రూ.12,500, ఎస్జీటీలకు రూ.10వేల గౌరవ వేతనం చెల్లిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉత్పత్తి తగ్గినా.. పెరగని ధరలు

ఇదెక్కడి న్యాయం అంటున్న ఉల్లి రైతులు



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఏ పంట ఉత్పత్తి అయినా తక్కువైతే మంచి ధర లభిస్తుంది. ఇదెక్కిడి దారుణమో.. కర్నూలు యార్డులో మాత్రం ఉల్లి సప్లయ్ భారీగా తగ్గినా ధర మాత్రం నామమాత్రంగా చేతికందుతుండటంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డుకు కేవలం 389 క్వింటాళ్ల ఉల్లి మాత్రమే అమ్మకానికి వచ్చింది. ధర కనిష్ఠంగా క్వింటానికి రూ.419లు, (ఎక్కువ లాట్లు)కు, మధ్యసం రూ.1,051లు, గరిష్ఠం రూ.1,409 మాత్రమే లభించింది. రెండు నెలల క్రితం కర్నూలు మార్కెట్ యార్డుకు వేల క్వింటాళ్లు అమ్మకానికి పోటెత్తాయి. అప్పుడు కూడా ఇదే ధర రైతులకు లభించింది. ప్రస్తుతం అమ్మకానికి వంద క్వింటాళ్లకి తగ్గినప్పుడు వ్యాపారులు ఎందుకు ధర తగ్గిస్తున్నారో అర్థం కావడం లేదని, ఈ విషయంలో మార్కెట్ కమిటీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో తమకు తీరని నష్టాన్ని కలిగిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు పథకాలు అందించాలి

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- మద్దికెరలో పర్యటించిన కలెక్టర్ సిరి

మద్దికెర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందేలా అధికారులు చూడాలని కలెక్టర్ డాక్టర్ సిరి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ సిరి నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి ముందుకు సాగాలన్నారు. ప్రజలకు వైద్యసేవలు అందేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య రాకూడదన్నారు. జగనన్న కాలనీలో రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ స్థలాలు ఉన్న చోట పేద ప్రజలకు అర్హులైన వారికి పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ప్రకారం ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి అధికారులు నివేదికలు తయారు చేస్తున్నారని అన్నారు. రీసర్వే విషయంలో రైతుల నుంచి అభ్యంతరాలు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భరత్ నాయక్, ఎంపీడీవో కొండయ్య, ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, ఏపీవో నర్సిరెడ్డి, ఏవో రవి, డిప్యూటీ ఎంపీడీవోలు విజయలక్ష్మి, వై. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి సాగు చేసి నష్టపోయాం.. ఆదుకోండి

కలెక్టర్‌కు రైతుల మొర

అధిక వర్షాలు, గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని ఉల్లి రైతులు కలెక్టర్ డాక్టర్ సిరిని కలిసి విన్నవించుకున్నారు. మంగళవారం మద్దికెర, బురుజుల ప్రాంతాలలో రబీలో రైతులు సాగు చేసిన పప్పుశనగ పంటను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది అధిక వర్షాలు పడటంతో నల్లరేగడి పొలాల్లో సాగు చేసిన ఉల్లి పంట చేతికి రాలేదని, వచ్చిన పంటకు గిట్టుబాటు ధర అందలేదని, ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలన్నారు. ఉల్లి పంటకు ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చిన వెంటనే రైతుల ఖాతాలో జమ అవుతుందని అన్నారు.



కలెక్టర్ సిరితో మాట్లాడుతున్న రైతులు

ఆదోని జిల్లా ఏర్పాటు చేయాల్సిందే

- కొనసాగుతున్న రిలే దీక్షలు
- 500 మందితో మాజీ ఎంపీ బుట్టా రేణుక మద్దతు
- ఎమ్మిగనూరులో మానవహారం

కర్నూలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదోని జిల్లా సాధన కోసం వివిధ వర్గాల ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపడుతున్నారు. మంగళవారం ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో ఆందోళనలు కొనసాగాయి. ఆటో కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, రైతులు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు కలిసి జిల్లా సాధన కోసం ఉద్యమించారు. ఆదోని జిల్లా సాధన సమితి, జేఏసీ ఆధ్వర్యంలో భీమాస్ కూడలిలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి విగ్రహం ఎదుట



ఆదోనిలో దీక్షలకు మద్దతు పలుకుతున్న మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలు బుట్టా రేణుక, సాయి ప్రసాద్ రెడ్డి



ఎమ్మిగనూరులో ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 17వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు వైసీపీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ బుట్టా రేణుక దాదాపు 500 మందికి పైగా అనుచరులతో ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి చేరుకుని మద్దతు పలికారు. ఆమె వెంట ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఉన్నారు. కూటమి ప్రభుత్వం జిల్లా ఇవ్వకపోతే వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆదోని జిల్లా చేస్తామని ప్రకటించారు. సీనియర్ నాయకుడు పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డి కన్వీనర్‌గా జేఏసీ ఏర్పాటు చేశారు. ఈ జేఏసీలో న్యాయవాది లలితాజితేంద్ర, రిటైర్డ్ ఉపాధ్యాయులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడ్, నాయకులు నూర్ అహ్మద్, కోదండ, దస్తగిరి నాయుడు, కుంకూరు వీరేశ్‌లు సభ్యులుగా ఉన్నారు. ఇదిలా ఉండగా ఆదోని జిల్లా కోసం చేస్తున్న ఉద్యమాలు జోరందుకోవడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి నేడు అమరావతిలో సీఎం చంద్రబాబును కలవనున్నారు. కాగా జిల్లా సాధన కోసం ఏపీ ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మ్యానేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నాలుగు వేల మందితో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా వన్యప్రాణులను లెక్కిస్తాం

ఆత్మకూరు ప్రాజెక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్




వన్యప్రాణుల లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆత్మకూరు ప్రాజెక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్

ఆత్మకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేట్ - 2026 కార్యక్రమంలో భాగంగా ఫేస్-1 వన్యప్రాణుల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు ఆత్మకూరు ప్రాజెక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆత్మకూరు ప్రాజెక్ట్ పరిధిలో జరుగుతున్న వన్యప్రాణుల లెక్కింపు అంచనాల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 1 నుంచి 8వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు 178కిమీల అటవీ మార్గాల్లో లెక్కింపు బృందాలు పర్యటించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా వన్యప్రాణులను ప్రత్యక్ష వీక్షణం ద్వారా గుర్తించి వాటి వివరాలను నమోదు చేసుకున్నట్లు చెప్పారు. అలాగే అడవి స్థితిగతులకు సంబంధించిన వివరాలను కూడా సేకరించామని అన్నారు. ఈ క్రమంలోనే బైర్లూటి రేంజ్‌లో ఓ చిరుతను అటవీ సిబ్బంది గమనించినట్లు తెలిపారు. అలాగే ఒక పెద్దపులి పాదముద్రికను, పలు వన్యప్రాణుల మలమూత్రాలను కూడా సేకరించినట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు లెక్కింపు వివరాలను ఎంస్ట్రైప్స్ ఎకలాజికల్ మొబైల్ యాప్‌లో నిక్షిప్తపరుస్తున్నట్లు వెల్లడించారు.

అవిశ్వాసంలో నెగ్గిన టీడీపీ

- కర్నూలు ఎంపీపీ పీఠంపై పసుపు జెండా
- త్వరలోనే మండల అధ్యక్షుడి ఎన్నిక
- గైర్హాజరైన ఆరుగురు సభ్యులు
- చక్రం తిప్పిన విష్ణు, బొగ్గుల
- ఇక నుంచి ఎంపీటీసీగా వెంకటేశ్వరమ్మ
- మినిట్స్ బుక్‌లో పొందుపరిచిన ఆర్డీవో



అవిశ్వాస తీర్మానంలో పాల్గొన్న ఎంపీటీసీలు

కర్నూలు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల ఎంపీపీపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో ఎట్టకేలకు టీడీపీ నెగ్గింది. దీంతో కర్నూలు ఎంపీపీ పీఠంపై పసుపు జెండా ఎగిరింది. తెలుగు తమ్ముళ్లు, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. మంగళవారం కర్నూలు ఆర్డీవో కిడారి సందీప్‌కుమార్ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలోని మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో వైసీపీ మద్దతుతో నెగ్గిన ఎంపీపీ వెంకటేశ్వరమ్మపై గతంలో టీడీపీ మద్దతు ఎంపీటీసీలు కలిసి ఇచ్చిన వినతిపత్రం మేరకు ఆర్డీవో అవిశ్వాస తీర్మానం గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కర్నూలు మండలంలో మొత్తం 19మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా ఈ సమావేశానికి 13మంది టీడీపీ మద్దతుదారు ఎంపీటీసీలు పాల్గొన్నారు. మిగిలిన ఆరుగురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. ఈ ప్రత్యేక సమావేశం ఉదయం 11-45 గంటలకు ప్రారంభమై, కర్నూలు మండల ఎంపీపీ వెంకటేశ్వరమ్మపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం కాపీని ఆర్డీవో సభ్యులకు చదివి వినిపించారు. వెంటనే వైసీపీకి చెందిన ప్రసుత ఎంపీపీ వెంకటేశ్వరమ్మ తమకొద్దని, ఆమె ఎన్నికను వ్యతిరేకిస్తున్నట్లు 13 మంది టీడీపీ ఎంపీపీటీసీ సభ్యులు చేతులెత్తి ప్రకటించారు. కర్నూలు రూరల్ తహసీల్దార్ వెంకటరమేష్‌బాబు, ఎంపీడీవో రఘునాథ్ కలిసి చేతులెత్తిన సభ్యుల వివరాలను రికార్డులో పొందుపరిచారు. 13మంది ఎంపీటీసీ సభ్యులు కోరిక మేరకు వారి తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్లు కర్నూలు ఆర్డీవో ప్రకటించారు. ఇక నుంచి కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ ఉల్చాల గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాత్రమేనని ఆయన తెలిపారు.

మిగతా 5వ పేజీలో



ఈ భవనం ఎప్పుడైనా కూలొచ్చు..

శిథిల భవనం

కర్నూలు కలెక్టరేట్ ప్రాంగణంలో దాదాపు 40శాఖలు ఉన్నాయి. వీటిలో శ్రీశైలం ప్రాజెక్టు సంబంధించిన భవనం శిథిలావస్థకు చేరింది. ఈ భవనం నిర్మించి 42 సంవత్సరాలు కావస్తోంది. నాటి నుంచి నేటి వరకు అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. ప్రభుత్వ రికార్డులకు కూడా భద్రత లేకుండా పోయింది. వర్షం పడితే ఆ భవనం చిత్తడే. భవనం ఎప్పుడు కూలుతుం దోననే పరిస్థితి నెలకొంది. అక్కడ పనిచేసే ఉద్యోగులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి రికార్డులు కూడా భద్రపరుచుకోలేని నిర్లక్ష్య స్థితిలో అధికారులు ఉన్నారు.

● కర్నూలు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి



విలువైన డాక్యుమెంట్లు, రికార్డులు ఉన్న గది ఇలా





గోడలు కూలిపోయి శిథిలావస్థలో దర్శనమిస్తున్న కార్యాలయం..

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు కుమార్ యాదవ్

● ప్రసంగించడానికి ఎంపికైన ఉపాధ్యాయుడు



బనగానపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక ఇండియా ఇంటర్నేషనల్ సైన్సు ఫెస్టివల్‌లో (ఐఐఎస్ఎఫ్) ప్రసంగించడానికి టీచర్ వీరబోయిన కుమార్‌యాదవ్ ఎంపికయ్యారు. నంద్యాల జిల్లాలోని బనగానపల్లె మండలం నందవరం జడ్పీహెచ్ఎస్ టీచర్ కుమార్‌యాదవ్ ఒకేసారి రెండు విభాగాలకు ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని చెప్పవచ్చు. డిసెంబరు 5 నుంచి 9 వరకు చండీగఢ్‌లో ఇండియా ఇంటర్నేషనల్ సైన్సు ఫెస్టివల్ 2025లో జరుగనుంది. గత సంవత్సర గువహటిలో జరిగిన సైన్సు ఫెస్టివల్‌లోనూ ఉపాధ్యాయుడు కుమార్‌యాద్ పాల్గొని ప్రసంగించారు. ఈసారి కూడా జాతీయ వేదికపై ఆయన పాల్గొనడం ఆయన ప్రతిభకు నిదర్శనం. రాయలసీమ రీజనల్ పర్యావరణ సమన్వయ కర్తగా, రాష్ట్ర కౌశల్ కోఆర్డినేటర్‌గా, జిల్లా బాలల సైన్సు కాంగ్రెస్ ఆఫీసర్, జిల్లా పర్యావరణ కర్తగా ఆయన సేవలందించారు. పర్యావరణంపై పుస్తకాలు, శాస్త్రీయ కథనాలు రాసి గ్రామీణ విద్యార్థులకు శాస్త్రాన్ని సులభంగా చేరవేసే ఉపాధ్యాయుల్లో ఆయన ముందుంటారు. ఇండియన్ సైన్సు కాంగ్రెస్, నేషనల్ టీచర్స్ సైన్సు కాంగ్రెస్ వంటి వేదికలపై అనేక పరిశోధనా పత్రాలు సమర్పించి నిపుణుల ప్రశంసలు అందుకున్నారు. కుమార్‌బాబు మార్గదర్శకత్వంలో గ్రామీణ విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో అనేక విజయాలు సాధించారు. మాతృభాషలో సైన్సు లిటరేచర్ అందించడం ద్వారా విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనలు పెంపొందించాలనే లక్ష్యంతో ఈ వేదికపై ప్రసంగించనున్నారు. జిల్లా విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గం, స్థానిక ప్రతినిధులు కుమార్‌యాదవ్‌కు అభినందనలు తెలిపారు.

టార్పాలిన్ల తంటాలు

● వర్షాలకు నష్టపోతున్న పంట ఉత్పత్తులు
● రైతులకు తప్పని ఎదురు చూపులు



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు అవసరమైనని టార్పాలిన్లు లేక రైతులు తంటాలు పడుతున్నారు. రైతులను ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుచేసిన పంటలను భారీవర్షాలు, తుఫాన్లు ముంచెత్తుతున్నాయి. చేతికందిన పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఉమ్మడి జిల్లాలో తుఫాన్‌లు, విపత్తులు గత ఖరీఫ్‌లో అన్నదాతల వెన్ను విరిచాయి. ప్రస్తుత రబీలోనూ వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంట చేతికందే సమయంలో వర్షాలతోనే తమ బతుకులు తెల్లారుతున్నాయని రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఇటీవల సంభవించిన 'మొంథా'తో పాటు తాజాగా దిత్వా తుఫాన్ రైతులను బెంబేలెత్తిస్తోంది. గత మూడు రోజులుగా ఎండనేది లేకుండా రైతులు పంట ఉత్పత్తులు వర్షానికి ఎక్కడా తడిసిపోతాయోనని రాత్రింబవళ్లు కళ్లలో ఒత్తులు పెట్టుకుని పొలాలు, కల్లాల వద్దే కూర్చోవాల్సిన పరిస్థితి దాపురించింది. గత వైసీపీ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. 2014 నుంచి 2019 వరకు రాయితీ పై తార్పాలిన్ల పంపిణీని అటకెక్కించేసింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లను అందించారు.

కంటి మీద కునుకు లేకుండా

ప్రస్తుతం కర్నూలు జిల్లాలో పత్తితీతలు జోరుగా సాగుతున్నాయి. సీసీఐ కేంద్రాల్లో ఇప్పుడిప్పుడే పత్తి అమ్మకాలు పుంజుకుంటున్నాయి. కర్నూలు జిల్లాలో 11 కేంద్రాల్లో, నంద్యాలలో ఒక కేంద్రంలో అధికారులు రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఈ కేంద్రాలకు రైతులు పత్తి తరలించేందుకు ఉన్న ఫలంగా వచ్చి పడుతున్న తుఫాన్లు, వర్షాలు వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సీసీఐ అధికారులు 8 నుంచి 12 శాతం లోపే తేమ ఉండాలని ఆంక్షలు పెట్టింది. వారు పెట్టిన నిబంధనలను అనుసరించేందుకు రైతులకు ప్రస్తుత వర్షాలకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతుంది. ఇప్పటికైనా తమకు టార్పాలిన్లను అందించాలని మొర పెట్టుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

నూర్పిళ్ల సమయంలో..

ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ప్రస్తుతం కోత దశకు చేరింది. నూర్పిళ్ల సమయంలో వర్షాలు కురిస్తే.. ధాన్యాన్ని కాపాడుకోవడం తమ చేతకావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.10వేలు విలువ చేసే శిల్పాలిష్ టార్పాలిన్లను రాయితీపై రూ.5వేలకు అందించారు. రూ.2,500కు విలువ చేసే నల్ల తార్పాలిన్ల పట్టాను రూ.1250కు అందజేశారు. రైతుల పొలం విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో రైతుకు రెండు, మూడు తార్పాలిన్లను అందించారు. కొన్నేళ్లుగా రాయితీపై టార్పాలిన్ల పంపిణీని ప్రభుత్వాలు అటకెక్కించడంతో వర్షాల నుంచి పంట ఉత్పత్తులను కాపాడుకోవడానికి రైతులే వాటిని సొంతగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురిం చింది. వ్యవసాయాధికారులను టార్పాలిన్లు ఎప్పుడు పంపిణీ చేస్తారని అడిగితే.. ప్రభుత్వం టార్పాలిన్ల పంపిణీకి ఇంకా ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదని చెబుతున్నారు.

శాస్త్రీయ సంగీతానికి విశ్వఖ్యాతి

శ్రీశైలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో మన శాస్త్రీయ సంగీతం ప్రత్యేక గర్తింపు, ఖ్యాతి దక్కించుకుందనికేంద్ర ప్రభుత్వ టూరిజం శాఖ హైదరాబాద్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కృపాకర్ రావిపాటి అన్నారు. శ్రీశైల క్షేత్రానికి వచ్చే యాత్రికులకు భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, ఆధ్యాత్మిక పర్యాటకంతో కళలను అనుసంధానించడంపై పలు విషయాలను వివరించారు. మంగళవారం సాయంత్రం ఆలయ దక్షిణ మాడవీధిలో ధర్మపథం వేదికపై బెంగళూ రుకు చెందిన కృష్ణవేణి సంగీత నీరాజనోత్సవం జరిగింది. కర్ణాటక సంగీత గాత్ర కచేరిలో విదూషి అంజలి, శ్రీరామ్‌లు కీర్తనలు ఆలపించగా విద్వాన్ అచ్యుతరావు వయోలీన్, విదూషి రంజని, వెంకటేష్ మృదంగ సహకారం అందించారు. ఈ కార్య క్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, ఈఓ శ్రీనివాసరావు, టూరిజంశాఖ డివిజనల్ మేనేజర్ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికను తీసుకుంటున్న కృపాకర్ రావిపాటి

కర్నూలు జీజీహెచ్‌కు
రెండు స్టేట్ అవార్డులు

● బెస్ట్ బ్లడ్ బ్యాంకు, ఉత్తమ ఐసీటీసీ సెంటర్లుగా అవార్డుల స్వీకరణ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్)కు రెండు స్టేట్ ఫస్ట్ అవార్డులు వచ్చినట్లు హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ బ్లడ్ బ్యాంకుకు రాష్ట్రంలోనే అత్యధికంగా రక్తం యూనిట్లను కలెక్ట్ చేసినందుకు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం లభించగా విజయవాడలో అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది 11,531 బ్లడ్ యూనిట్లను సేకరించడంతో రాష్ట్ర స్థాయిలో మొదటిస్థానంలో నిలిచిందన్నారు. బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్లు సుధీర్, రసూల్, కిరణ్ కుమార్, రంగస్వామిని అభినందించారు. జీజీహెచ్ మైక్రోబయాలజీ విభాగం పరిధిలో పనిచేస్తున్న ఐసీటీసీ సెంటర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవల అవార్డు అందుకుంది. హెచ్ఐవీ స్కీనింగ్ సేవలు, కౌన్సిలింగ్ నాణ్యత, డేటా మేనేజిమెంట్ రోగుల సేవలో చూపుతున్న పనితీరుకు గుర్తింపుగా పురస్కారం ప్రదానం చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ నాగజ్యోతి, ఐసీటీసీ ఇన్‌చార్జి డాక్టర్ శరణ్య, కౌన్సిలర్స్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.




బెస్ట్ బ్లడ్ బ్యాంకు అవార్డుతో సూపరింటెండెంట్, వైద్యులు

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.





కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను

\- సంయుక్త

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహారాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2
టికెట్ ధరల పెంపు

\- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాధరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి
వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్గియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ

రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది.

వినూత్నంగా వన్ బై ఫోర్

ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

అవిశ్వాసంలో నెగ్గిన టీడీపీ



ఎంపీటీసీలతో ఎమ్మెల్యే, కేడీసీసీబీ చైర్మన్

(3వ పేజీ తరువాయి)

మొత్తం 19మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఆరుగురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు హాజరుకానందున సమావేశంలో ఉన్నవారిలో రెండు బై మూడో వంతు ప్రకారం 13మంది ఎంపీటీసీలతో కోరం సంపూర్ణంగా ఉన్నట్లు వివరించారు. 13మంది సభ్యుల తీర్మానాన్ని ఆమోదిస్తూ పంచాయతీ మినిట్స్ బుక్కులో ఆర్డీవో నమోదు చేశారు. రెండో పట్టణ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

త్వరలోనే కొత్త ఎంపీపీ ఎన్నిక

ఉల్చాల ఎంపీటీసీ సభ్యురాలు డి. వెంకటేశ్వమ్మకు ఎంపీపీ పదవిని రద్దు చేసినట్లు ఆర్డీవో తెలిపారు. అవిశ్వాస తీర్మానంలో మెజార్టీ సభ్యులు ఆమెను వ్యతిరేకించారని వివరించారు. ఈ తీర్మానం కాపీని జడ్పీ సీఈవో, కలెక్టర్‌కు పంపనున్నారు. అక్కడ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపి ఆయన పరిశీలించిన అనంతరం ప్రిన్సిపల్ అనుమతితో కొత్త ఎంపీపీ ఎన్నికకు గడువును నిర్ణయిస్తారు. కాగా మండల అధ్యక్షుడి ఎవరనేది ఉత్కంఠత నెలకొంది. కర్నూలు మండలంలో చాలా మంది ఎంపీపీ పదవి కోసం ఆసక్తి చూపుతున్నారు. కోడుమూరు ఎమ్మెల్యే, కేడీసీసీబీ చైర్మన్ ఎంపీపీ పదవి ఎవరికి కేటాయించాలో స్పష్టత లేదు. ఇప్పటికే కొంతమంది ఎంపీటీసీ సభ్యులు తనకే మాటిచ్చారంటూ ప్రచారం చేసుకుంటున్నారు. కేవలం మరో 8నెలలే ఈ పదవీ కాలం ఉంది. .

చక్రం తిప్పిన విష్ణు, ఎమ్మెల్యే బొగ్గుల

కర్నూలు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానంలో కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బొగ్గుల చక్రం తిప్పారు. 2021 ఎంపీపీ ఎన్నికను దృష్టిలో పెట్టుకొని ఈసారి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లి పట్టు సాధించారు. అవిశ్వాస తీర్మాన విషయంలో కర్నూలు మండలంలో మొదటిస్థానంలో నిలిచింది. అనంతరం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మీడియాతో మాట్లాడారు. ఎంపీపీ స్థానం టీడీపీ కైవసం చేసుకో వడం సంతోషకరమని అన్నారు. ఈ క్రెడిట్ విష్ణువర్ధన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు.

నిందితుల అరెస్టు

- 1,250 గ్రాముల గంజాయి స్వాధీనం

డోన్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయం చేస్తున్నట్లు సమాచారం మేరకు మంగళవారం రాత్రి రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1,250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా నిందితుల వివరాలు వెల్లడించారు. ఏ1 నిందితుడుగా డోన్ కొత్తపేటకు చెందిన ఈడిగ ఈశ్వర్‌గౌడు అలియాస్ గాలిగాడు, ఏ2 డోన్ పాతపేటకు చెందిన షేక్ హుస్సేన్ అలియాస్ హుసేన్‌వలీ అలియాస్ హుసన్ బాయ్, ఏ3గా కొండపేటకు చెందిన చాకలి హరికృష్ణ అలియాస్ గుండులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, సిబ్బంది నాగరాజు, సీతారామయ్య, రాము పాల్గొన్నారు

నంద్యాలలో ఇద్దరి దారుణ హత్య

- ఘాతుకానికి దారి తీసిన దంపతుల మధ్య గొడవ
- ఘటనా స్థలిలోనే ఒకరు.. చికిత్స పొందుతూ మరొకరు మృతి

నంద్యాల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలో ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. దంపతుల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ జంట హత్యకు దారి తీసింది. ఇందుకు సంబంధించిన వివరాలు





కొమ్ము పెద్దన, చాకలి సురేశ్ (ఫైల్)

ఇలా... నంద్యాల పట్టణంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఓ ఘర్షణలో ఓ యువకుడు దారుణ హత్యకు గురికాగా మరో వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన హరిజనపేటలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. నంద్యాల పట్టణంలోని హరిజనపేటకు చెందిన పెద్దన్న(26), మధు అన్నదమ్ములు. వీరిలో పెద్దన్న స్థానికంగా ప్రభుత్వాస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతడి డో అన్న మధు అదే కాలనీకి చెందిన మహాలక్ష్మి అనే యువతిని ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం దంపతులు మధు, మహాలక్ష్మి ఇంట్లో గొడవ పడ్డారు. ఆ సమయంలో మధు తల్లి లక్ష్మీదేవిని వారు తోసేసారు. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. స్థానికులు ఆమెను ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడే పనిచేస్తున్న పెద్దన్న తల్లి బాగోగులు చూసుకుని రాత్రి ఇంటికి వెళ్లాడు. గొడవ అనంతరం మహాలక్ష్మి అదే కాలనీలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లిని కిందకు తోసేశారన్న కోపంతో పెద్దన్న స్నేహితుడు చాకలి సురేశ్(25)తో కలసి.. వదిన మహాలక్ష్మి ఇంటికి వెళ్లాడు. 'మా అమ్మను ఎందుకు కొట్టారు. వృద్ధురాలిపై చేయి చేసుకోవడం ఏమిటి..' అంటూ వదినపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ వివాదంతో విసిగిపోయిన మహాలక్ష్మి తమ్ముడు రాజ్‌కుమార్ ఆగ్రహంతో ఊగిపోయాడు. ఇంట్లో ఉన్న కత్తి తీసుకుని పెద్దన్నపై దాడికి పాల్పడ్డాడు. విచక్షణా రహితంగా కత్తితో పొడిచి హతమార్చాడు. ఇదే సమయంలో దాడిని అడ్డుకోబోయిన స్నేహితుడు చాకలి సురేశ్‌ను కూడా కత్తితో పొడిచాడు. స్థానికులు గమనించి కొన ఊపిరితో ఉన్న సురేశ్‌ను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే మంగళవారం మధ్యాహ్నం సురేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హత్య అనంతరం నిందితుడు రాజ్‌కుమార్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు రాజ్‌కుమార్‌తో పాటు, ఆయన తల్లిదండ్రులు లక్ష్మియ్య, సరస్వతి, సోదరి మహాలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మృతుడి బంధువులు ఆగ్రహావేశాలు తట్టుకోలేక రాజ్‌కుమార్ ఇంటిపైకి దాడికి దిగారు. అక్కడ నిందితుడు రాజ్‌కుమార్ ద్విచక్రవాహనాన్ని దహనం చేశారు. నంద్యాల వన్‌టౌన్ పోలీసులు, ఇన్‌చార్జి సీఐ అస్రార్ బాషా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

అనవసర వివాదంలోకి వెళ్లి మృతి...

నంద్యాల పట్టణంలోని ఉప్పరిపేటకు చెందిన మంగయ్య, ఉమాదేవి దంపతుల కుమారుడు సురేశ్ (25) అనవసర వివాదంలోకి వెళ్లి హత్యకు గురయ్యాడు. సెక్యూరిటీ గార్డు పెద్దన్న, సురేశ్‌లు కొన్నేళ్లుగా స్నేహితులు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో పెద్దన్న ఉప్పరిపేటకు వెళ్లి పని ఉందని సురేశ్‌ను వెంటపెట్టుకుని వెళ్లాడు. స్నేహితుడు కావడంతో భోజనం చేసి నిద్రించాల్సిన సురేష్ పెద్దన్నతో పాటు బైక్‌లో కలసి వెళ్లాడు. అక్కడ మహాలక్ష్మి పుట్టింటి వద్ద జరిగిన ఘర్షణలో అన్యాయంగా సురేశ్ బలయ్యాడు. స్నేహితుడిని రక్షించే క్రమంలో కత్తిపోట్లకు గురయ్యాడు. అడ్డు వచ్చిన సురేశ్‌పై నిందితుడు రాజ్‌కుమార్ కత్తితో కడుపులో పొడిచాడు. దీంతో ఆయన పేగులు బయటకు వచ్చాయి. ఘటన అనంతరం వైద్యులు ఆపరేషన్ చేసినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

పెండింగ్‌లో గౌరవ వేతనం

- ఆరు నెలలుగా అతిథి అధ్యాపకుల ఆవేదన
- జిల్లాలో 50 మంది గెస్టు ఫ్యాకల్టీ



నగరంలోని ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కళాశాల

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేసే అతిథి అధ్యాపకులు (గెస్టు ఫ్యాకల్టీ)కి గౌరవ వేతనాలు ఇవ్వడం లేదు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. దీంతో అతిథి అధ్యాపకులు ఆర్థిక ఇబ్బందులతో బోధనపై దృష్టి పెట్టలేక సతమతమవుతున్నారు. కర్నూలు జిల్లాలో 23 జూనియర్ కళాశాలలో మొత్తం 50 మంది అతిథి అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.27వేల గౌరవ వేతనం ప్రభుత్వం ఇస్తోంది. కొందరు గెస్టు అధ్యాపకులకు జూన్, జూలై నెలల గౌరవ వేతనం విడుదల చేసింది. మరి కొందరికి జూన్ నెల నుంచి వేతనం ఇవ్వడం లేదు. కళాశాలలో విద్యార్థులకు బోధనతో పాటు కుటుంబాలను పోషించుకోలేక ఆందోళన చెందుతున్నారు. అప్పులు తెచ్చి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైసీపీ పాలనలో 2020-21, 2021-22 విద్యా సంవత్సరాలకు సంబంధించి గెస్టు ఫ్యాకల్టీకి గౌరవ వేతనం చెల్లించలేదు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం చెల్లించాలని పలుమార్లు ఇంటర్ బోర్డు కమిషనర్ సెక్రటరీని కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం కనిపించడం లేదు.



పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్టు ఫ్యాకల్టీకి పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం చెల్లించాలి. ఈ విద్యాసంవత్సరం జూన్ నుంచి గౌరవ వేతనం ఇవ్వడం లేదు. **-సలావుద్దీన్, ఏపీజీజేసీ, గెస్టు ఫ్యాకల్టీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు (జువాలజీ ఫ్యాకల్టీ, కర్నూలు మైనార్టీ జూనియర్ కళాశాల)**



రెగ్యులర్ జీతాలతోపాటు ఇవ్వాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న గెస్టు ఫ్యాకల్టీకి రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీన గౌరవ వేతనం చెల్లించాలి. జీతం అందకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారింది. **- మున్వర్ సుల్తానా, గెస్టు ఫ్యాకల్టీ, సివిక్స్, కర్నూలు ప్రభుత్వ మైనార్టీ (ఉర్దూ) జూనియర్ కళాశాల**

ప్రాణం తీసిన ఓవర్ టేక్

- అదుపు తప్పిన బైక్
- టిప్పర్ కిందపడి ఇద్దరి మృతి
- సంతోష్ నగర్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం



ఆసుపత్రిలో రోదిస్తున్న సుమన్ బంధువులు





సుమన్, చంద్రమోహన్ (ఫైల్)

కర్నూలు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నగర శివారులో సంతోష్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రమోహన్(29), సుమన్(28) అనే వ్యక్తులు దుర్మరణం చెందారు. మరో యువకుడు నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. హైదరాబాదు వైపు నుంచి నవీన్, చంద్రమోహన్, సుమన్ పల్సర్ బైక్‌పై కర్నూలు వస్తున్నారు. ముందు వెళుతున్న టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి కింద పడ్డారు. టిప్పర్ వీరిని ఢీ కొట్టడంతో చంద్రమోహన్, సుమన్ అక్కడికక్కడే మృతి చెందాడు. నవీన్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన నవీన్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సుమన్ తలపై టిప్పర్ ఎక్కడంతో తల నుజ్జునుజ్జయింది. ట్రాఫిక్ పోలీసులు చేరుకుని, సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

మృతులు ఇద్దరిదీ గూడూరు..

మృతి చెందిన చంద్రమోహన్, సుమన్ ఇద్దరు గూడూరు వాసులే. సుమన్ కర్నూలులోని ఇందిరాగాంధీ నగర్‌లో నివాసముంటూ అమీలియో ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. ఇతనికి భార్య మౌనిక, ఇద్దరు కొడుకులు ఉన్నారు. చంద్రమోహన్ గూడూరులో నివాసముంటున్నాడు. ఈయనకు భార్య మౌనిక ఉంది. చంద్రమోహన్ మేనత్త కొడుకు ఎమ్మిగనూరు చెందిన నవీన్ ఆదివారం గూడూరు వచ్చాడు. నవీన్, చంద్రమోహన్ కలిసి మంగళవారం సాయంత్రం కర్నూలు వచ్చి సుమన్‌ను పిలుచుకుని హైదరాబాదు వైపు పనిమీద వెళ్లారు. తిరిగి వస్తుండగా.. ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఒకరిని కాపాడిన ఆటో డ్రైవర్ సురేష్



ప్రమాద సమయంలో సంతోష్‌నగర్ వైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ సురేష్ ప్రమాదాన్ని గమనించి, ఆటోను సంతోష్‌నగర్ క్రాస్ వద్ద యూటర్న్ చేసుకుని ప్రమాద స్థలం వద్దకు వచ్చాడు. ఆ సమయంలో నవీన్, చంద్రమోహన్ కొన ఊపిరితో ఉన్నారు. కొందరు సెల్‌ఫోన్లలో వీడియో తీస్తున్నారే తప్ప, ఎవరు సాయం చేయలేదు. ఆటో డ్రైవర్ సురేష్ స్పందించి ప్రాణాలతో ఉన్న నవీన్‌ను ఓ వాహనంలో ఆసుపత్రికి తరలించారు. సరైన సమయంలో ఆసుపత్రికి తరలించడంతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. స్పందించిన సురేష్‌ను ట్రాఫిక్ సీఐ అభినందించారు.

అనుమతుల్లేని లాడ్జీలను కూల్చేస్తాం

- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

మంత్రాలయం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అనుమతి లేకుండా నిర్మించిన లాడ్జీలు, హోంస్టేలను కూల్చేస్తామని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మంత్రాలయంలో అక్రమంగా నిర్మించిన హోంస్టేలు, లాడ్జీలపై అకస్మికంగా ఆయన తనిఖీ చేశారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో నాయకుల ప్రమేయంతో అనుమతులు లేకుండా లాడ్జీలు నిర్మించుకున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అక్రమమైనవి సక్రమంగా చేసుకేందుకు అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. రామచంద్రనగర్‌లో ఇంటి అనుమతులు తీసుకుని హోంస్టేలుగా మార్చి భక్తుల నుంచి వేలల్లో దోచుకుంటున్నారన్నారు. కుడా అనుమతులు తీసుకోడానికి నెల గడువులో నోటీసులిచ్చి, యజమానులు స్పందించకపోతే నీరు, విద్యుత్ నిలుపుదలచేసి ఆపై కూల్చేస్తామన్నారు. పార్కింగ్‌కు స్థలాలు, అగ్నిమాపక ఏర్పాట్లు లేకుండా లాడ్జీలు, హోంస్టేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట మంత్రాలయం గ్రామ కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, రాజు, వరదరాజు, ఎంపీటీసీ మేకల వెంకటేష్, రాజు, రాగన్న ఉన్నారు.



హోంస్టేలను పరిశీలిస్తున్న సోమిశెట్టి

మహిళపై దాడి కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

కర్నూలు లీగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక గణేష్ నగర్‌లో ఓ ఫిర్యాదిపై దాడిచేసి దుర్భాషలాడిన కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది కారాగారశిక్షతో పాటు జరిమానా విధిస్తూ కర్నూలు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ అనిల్ కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. స్థానిక గణేష్ నగర్‌కు చెందిన రెండో నిందితుడు వెంకటస్వామి ఫిర్యాది అయిన గణేష్ నగర్‌కు చెందిన ఉప్పరి లక్ష్మీదేవికి తనకు పలుకుబడి ఉందని బ్యాంకు లోను ఇప్పిస్తామని చెప్పి రూ.70వేలు తీసుకున్నాడు. తర్వాత లోన్ రాకపోవడంతో ఫిర్యాది అయిన ఉప్పరి లక్ష్మీదేవి 2018 మే 23వ తేదీన వెంకటస్వామి చెల్లెలు మొదటి నిందితురాలు పిడతల లక్ష్మీదేవిని ప్రశ్నించింది. దీంతో ఆమె తన అన్న అయిన రెండో నిందితుడు వెంకటస్వామికి పోన్ చేసి పిలిపించుకుంది. అనంతరం ఇద్దరు నిందితులు పిడతల లక్ష్మీదేవి, వెంకటస్వామి ఉప్పరి లక్ష్మీదేవిపై దాడి చేసి దుర్భాషలాడారు. ఫిర్యాది ఉప్పరి లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు మూడో పట్టణ పోలీసులు ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితులపై నేరం రుజువు కావడంతో మొదటి నిందితురాలికి ఏడాది కారాగార శిక్షతో పాటు వివిధ సెక్షన్ల కింద మొత్తం రూ.13వేలు జరిమానా విధించారు. రెండో నిందితునికి ఏడాది కారాగారశిక్షతో పాటు వివిధ సెక్షన్ల కింద 11వేల జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ గోపాలకృష్ణ వాదించారు.

పార్ట్ టైం టీచర్ల నియామకం ఎప్పుడో..?

- ఖాళీ పోస్టుల భర్తీపై దృష్టి సారించని విద్యాశాఖ



ఆలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష పరిధిలో ఉన్న మోడల్ హాస్టల్‌లో వార్డెన్‌లకు 24 గంటల విధుల నుంచి మినహాయింపు ఇచ్చేందుకు రాష్ట్ర విద్యాశాఖ గత ఏడాది నవంబర్‌లో పార్ట్ టైం టీచర్ల నియామకానికి చర్యలు చేపట్టింది. అయితే కొందరు విధుల్లో చేరి పని గంటలు ఎక్కువగా ఉండడం వల్ల ఉద్యోగం వదిలేసి వెళ్లిపోయారు. జిల్లాలో 16 హాస్టళ్లు ఉండగా అందులో 9 హాస్టళ్లకు పార్ట్ టైం టీచర్స్ లేకపోవడంతో పరిస్థితి మొదటికొచ్చింది. తిరిగి ఆ పోస్టులను మెరిట్ జాబితాలో తదుపరి పేర్లు ఉన్న వారితో ఆ పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే ఆ ప్రక్రియ జరగకపోవడంతో జిల్లాలోని ఆస్పరి మండలం పుటకలమర్రి, గూడూరు మండలం జులేకల్, కోసిగి, పెద్దకడబూరు, కృష్ణగిరి, కోడుమూరు, ఎమ్మిగనూరు మండలం కడివెల్ల, మద్దికెర, మంత్రాలయం హాస్టళ్లకు పార్ట్ టైం టీచర్స్ నియామకం నిలిచిపోవడంతో విద్యార్థినులకు స్టడీ అవర్స్, సబ్జెక్టులు బోధించే వారు కరువయ్యారు. మరో 4 నెలల్లో పది, ఇంటర్ పరీక్షలు ఆరంభం కానుండడంతో ఫలితాలపై ప్రభావం పడనుంది. గత ఏడాది పార్ట్ టైం టీచర్స్‌ను నియమించి జాబ్‌చార్ట్ విడుదల చేశారు. ఒక వారం వార్డెన్ పగలు డ్యూటీ, ఒక వారం రాత్రి డ్యూటీ నిర్వహించాలని జాబ్ చార్ట్‌లో నిబంధనలు విధించారు. పార్ట్ టైం టీచర్స్ నియామకం జరగని హాస్టళ్లలో వార్డెన్‌లు 24 గంటలు విధులు నిర్వహించలేక రాజీనామాలకు సిద్ధమవుతున్నారు.

కేజీబీవీలో ఇదే పరిస్థితి..

హొళగుంద, మద్దికెర, హాలహర్వి మండలాల్లో సీఆర్టీ పోస్టులు ఖాళీగా ఉన్నా అధికారులు భర్తీ చేయకపోవడంతో పోస్టులు అలాగే మిగిలిపోయాయి. సబ్జెక్టు బోధించే వారు లేక విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి పార్ట్ టైం టీచర్ల నియామకానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కొత్త నోటిఫికేషన్ రావాల్సి ఉంది...

ఖాళీ పోస్టుల భర్తీకి స్టేట్ ఆఫీసు నుంచి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. జిల్లాల్లో 9 హాస్టళ్లకు పార్ట్ టైం టీచర్స్ నియామకం జరగాల్సి ఉంది. డైలీ వేజెస్ విధానంలో నియమించే విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. **- స్నేహలత, జీసీడీవో, సమగ్రశిక్ష, కర్నూలు**

సీసీ టీవీ ఫుటేజ్ తీసుకురండి

- రాష్ట్రంలోని జిన్నర్లకు సీసీఐ నోటీసులు
- 30 కొనుగోలు కేంద్రాల మిల్లులకు ఆదేశాలు

గుంటూరు సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన జిన్నింగ్ మిల్లుల యజమానులకు సీసీఐ సంచలన నోటీసులు జారీ చేసింది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన జిన్నింగ్ మిల్లుల సీసీ టీవీ ఫుటేజ్ తీసుకురావాలని మంగళవారం నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోలు చేసేందుకు సీసీఐ ఈ ఏడాది 30 కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 పేరుతో జిన్నింగ్ మిల్లులను విభజించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు నోటిఫై చేశారు. ఆయా కేంద్రాలు అన్నీ సీసీఐ లెక్కల ప్రకారం ఈ ఏడాది అక్టోబరు 29వ తేదీ నుంచి ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చినట్లుగానే భావించాల్సి ఉంది. అక్టోబరు 29వ తేదీ నుంచి ఆయా జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీల ఫుటేజ్ తీసుకురావాలని సీసీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు. గత ఏడాది సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, జిన్నింగ్ మిల్లుల్లో సుమారు రూ. 140 కోట్లు పక్క దారి పట్టాయని సీఐడీకి ఫిర్యాదులు వెళ్లిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజ్ తమకు ఇవ్వాలని సీఐడీ అధికారులు సీసీఐని ఆదేశించారు. అందుకోసం సీసీఐ ఈ తాజా నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక

ఆలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి రాధిక అన్నారు. మంగళవారం రాత్రి ఆలూరు పట్టణంలోని ఎస్సీ బాలికల బాలుర సంక్షేమ హాస్టళ్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని నేరుగా విద్యార్థులనే అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని వార్డెన్ మహమ్మద్ అలీని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారి రాధిక

ఐఏఎస్ అధికారి కూతురి అంత్యక్రియలు

- నివాళి అర్పించిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జవహర్



నివాళి అర్పిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జవహర్

బేతంచెర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గానిపల్లె తండా గ్రామానికి చెందిన ఐఏఎస్ అధికారి చిన్నరాముడు కూతురు మాధురి సాహితిబాయి అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు ఏపీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జవహర్ హాజరై మాధురి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బేతంచెర్ల సీఐ వెంకటేశ్వర రావు, ప్రవీణ్ కుమార్, మంజునాథ్ రెడ్డి సమక్షంలో ఎస్ఐలు రమేష్‌బాబు, తిరుపాలు, బనగానపల్లె ఎస్ఐలు దుగ్గిరెడ్డి, కల్పన పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై దృష్టి పెట్టండి

● ఎస్పీ విక్రాంత్ పాటిల్ ● ఉలిందకొండ పోలీస్ స్టేషన్ తనిఖీ



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఉల్లిందకొండ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టు, దర్యాప్తు పురోగతిపై కే ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సీఐలు, ఎస్‌ఐలతో మాట్లాడుతూ ప్రాపర్టీ కేసులను ఛేదించి రికవరీ చేయాలని, బాధితులు స్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు వారి పరిష్కారం చూపాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాబు ప్రసాద్, రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్, ఎస్‌ఐ ధనుంజయ పాల్గొన్నారు.

రేపు 'ఘంటసాల స్వరార్చన'

కర్నూలు కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో గురువారం సాయంత్రం 'ఘంటసాల స్వరార్చన' ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ హాజరవుతారని తెలిపారు. సంగీతవిభావరిలో హైదరాబాద్ గాయకుడు డీఏ మిత్ర ఆధ్వర్యంలో, గాయకులు టి. అఖిల, శ్రీనివాసులు అలనాటి ఘంటసాల పాటలను ఆలపిస్తారని వివరించారు. కార్యక్రమంలో న్యూరో సర్జన్ డాక్టర్ డబ్లు సీతారాంకు 'ఘంటసాల విశిష్ట సేవా పురస్కారం' ప్రదానం చేయనున్నట్లు కన్వీనర్ ఎస్ఎండీ ఇనాయతుల్లా తెలిపారు.

బీఈడీ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ 4వ సెమిస్టర్ ఫలితాలను ప్రొఫెసర్, ఉపకులపతి వి. వెంకట బసవరావు విడుదల చేశారు. సెప్టెంబర్‌లో నిర్వహించిన పరీక్షలకు రెగ్యులర్ విభాగంలో 3,225కి గాను 3,121 మంది, సప్లిమెంటరీ విభాగంలో 122 మంది పరీక్షలు రాయగా 118 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



బుధవారపేటలో సంతకాలు సేకరిస్తున్ననాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారపేట 16వ వార్డులో వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి పాల్గొన్నారు. ఎస్వీ మాట్లాడు తూ ఇతర రాష్ట్రాల్లో తక్కువ ర్యాంక్ వచ్చిన వారికి కూడా డాక్టర్ వస్తోందన్నారు. మెడికల్ కళాశాలలను పూర్తిచేయకపోవడంతో మన రాష్ట్రంలో మంచిర్యాంక్ వచ్చిన విద్యార్థులకు కూడా ఎంబీబీ ఎస్ సీటు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు తిరుమలేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా స్టాంటన్ జయంతి



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో డా.విలియం ఆర్థర్ స్టాంటన్ 159వ జయంతి నిర్వహించారు. మంగళవారం నగరంలోని ఖండేరి వీధిలోని సీయోను ప్రార్థనా మందిరం వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు జి. రవికుమార్ మాట్లాడుతూ స్టాంటన్ దొర కర్నూలుకు చేసిన సేవలు ఎనలేనివన్నారు. కోల్స్, ఎస్టీబీసీ, రాక్‌వుడ్, ఈసీయం విద్యాసంస్థలను ఏర్పాటుచేసి విద్యాభివృద్ధికి కృషిచేశారని కొనియాడారు. ఆయన సేవలకు గుర్తింపుగా నగరంలో స్టాంటన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి టీజీ భరత్‌ను కోరినట్లు తెలిపారు. పాస్టర్ డా.ఇమ్రాన్, ఎల్‌డి.మణి, పుష్పరాజ్, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు

గంజాయి ముఠాపై నిఘా ఉంచాలి

కోడుమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసులు గంజాయి ముఠాపై నిఘా ఉంచి, దాన్ని అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములుగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఒక ప్రైవేటు కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలో బెట్టింగ్, మట్కా జూదంతో పాటు గంజాయి సరఫరా అవుతుందని ఆరోపించారు. వీటి ఉచ్చులోపడి యువత వాళ్ల జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత బెట్టింగ్, మట్కాకు అలవాటు పడి అప్పుల ఊబిలో చిక్కుకున్నారని, పోలీసులు కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు. మునిస్వామి, అఖిల్, హరి, తరుణ్, కళదర్ పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

● అధ్యాపకులతో ఆర్‌యూ ఉపకులపతి

కర్నూలు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాన్వకేషన్‌లో చూపిన స్ఫూర్తిని కొనసాగిస్తూ వర్సిటీ అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేద్దామని ఉపకులపతి వి.వెంకట బసవరావు కోరారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీ సెనేట్ హాలులో ఆధ్యాపకులతో సమావేశంలో నిర్వహించారు. 4వ స్నాతకోత్సవం విజయవంతం చేసినందుకు ఆద్యాపకులను అభినందించారు. గవర్నర్, వర్శిటీ ఛాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రశంసించారని తెలిపారు. వర్శిటీకి ఎన్ఏఏసీ, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో మెరుగైన స్థానం సాధించడానికి ప్రయత్నించాలన్నారు. స్థానికంగా ఉన్న ట్రిపుల్ ఐటీ, ఐటీడీఎం, క్లస్టర్ విద్యాసంస్థల పరిశోధనలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రా బోయ విజయ కుమార్ నాయుడు, ప్రిన్సిపాళ్లు సి.విశ్వనాథ్‌రెడ్డి, సుందరానంద పుచ్చా, ప్రొఫెసర్లు సీవీ కృష్ణారెడ్డి, పరీక్షల విభాగం డీన్ నరసింహులు, ఐక్యూఏసీ డీన్ భరత్ కుమార్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సి.బెళగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీలర్లు ఎరువులు, పురుగు మందలను అధిక దరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో మల్లేష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్‌ను రికార్డులలో నమోదు చేయాలని, ధరల పట్టికను నోటీసు బోర్డులో ఉంచాలని, విక్రయించే ఎరువులకు తప్పక బిల్లులు అందజేయాలన్నారు. ఎంపీవోలు వెంకటేశ్వర్లు, ఈశ్వర్ ఉన్నారు.

శాలివాహన సంఘం అధ్యక్షుడిగా నాగన్న

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కర్నూలు చెందిన కేసీ నాగన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్య వ్యవహరించారు. గౌరవాధ్యక్షుడిగా జి.పుల్లయ్య, గౌరవ సలహాదారుడిగా కె.సోమేష్, కె.నాగేశ్వరరావు, కె.బజారప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌టీ రమేష్ ఎన్నికయ్యారు. తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ కుమ్మలు ఐకమత్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

నిందితురాలి అరెస్టు

కర్నూలు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలి మెడలో నుంచి గొలుసు తెంపుకునేందుకు ప్రయత్నం చేసిన నిందితురాలిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం జయరామ్‌నగర్‌లో దేవమ్మ అనే వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్తుండగా అటకాయించి బెదిరించి గొలుసు తెంపుకునే ప్రయత్నం చేసింది. స్థానికులు ఆమెను పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం విదితమే. నిందితురాలిని జోహరాపురం చెందిన యాస్మిన్‌గా గుర్తించి, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. జోహరాపురం చెందిన యాస్మిన్ పలు ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవనం చేస్తుంది.

రహదారి విస్తరణలో బాధితులకు పూర్తి న్యాయం

● కమిషనర్ పి. విశ్వనాథ్



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలో చేస్తున్న రహదారి విస్తరణ పనుల్లో భూమి, భవనాలు కోల్పోయే బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని నగర పాలక కమిషనర్ పి. విశ్వనాథ్ పేర్కొన్నారు. కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట వరకు(ఆర్‌టీపీ-2), చెక్‌పోస్టు నుంచి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు రహదారి విస్తరణ పురోగతిపై మంగళవారం కార్యాలయంలో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. విస్తరణ పనుల కోసం అవసరమైన ప్రకియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బాధితులకు ట్రాఫిక్ నియంత్రకణ, రహదారుల విస్తరణ ఆవశ్యకతను వివరించి, యాజమాన్య పత్రాలను తీసుకోవాలని ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట వంతెన వరకు రహదారి విస్తరణలో ప్రకభావితమవుతున్న 82 ఆస్తుల యజమానులతో మాట్లాడి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే ఎన్‌హెచ్ 340సీ రహదారి విస్తరణకు సంబంధించిన 201 ప్రభావిత ఆస్తుల యజమానులతో సమగ్రగంగా చర్చించి సందేహాలను నివృత్తి చేయాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నగరాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఇంచార్జి సీపీ వెంకటరమణ, టీపీవో అంజాద్‌బాషా, బిల్డింగ ఇన్స్‌పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి

● నగర పాలిక కమిషనర్ పి. విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఓటర్ల మ్యాపింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని రిటర్నింగ్ అధికారి, నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. మంగళవారం సమావేశ భవనంలో అసిస్టెంట్ ఆర్‌వోలు, బూత్‌స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) మ్యాపింగ్‌ను బూత్‌స్థాయిలో జాగ్రత్తగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ఓటరు వివరాలు, చిరునామా ధృవీకరణ, కుటుంబ సభ్యుల సమాచారం యాప్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నియామవళి ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో మొత్తం 2,74,743 మంది ఓటర్లు ఉండగా ఇప్పటికి 29,946 మాత్రమే చేశారన్నారు. ప్రతి బూత్‌లో 100 శాతం మ్యాపింగ్ సాధించాలన్నారు. నియోజకవర్గానికి అదనంగా ముగ్గురు అదనపు ఏఈఆర్‌ఓలను కలెక్టర్ నియమించారని కర్నూలును రాష్ట్రంలోనే ఆదర్శ నియోజ కవర్గంగా నిలపాలని కోరారు. తహసీల్దార్ రవికుమార్, అదనపు ఏఈఆర్‌వోలు ఆర్‌జీవి. కృష్ణ, కేవి.సతీష్‌కుమార్‌రెడ్డి, పివి.శేషసాయి, డీటీ ధనుంజయ, సూపరిం టెండెంట్ సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలపై ఉదాసీనత తగదు..

మొండి బకాయిలపై ఉదాసీన వైఖరి తగదని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ పేర్కొన్నారు. . మంగళవారం కార్యాలయలో రెవెన్యూ విభాగ సిబ్బందితో వసూళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. రూ.93 కోట్ల ఆస్తి పన్నులు, రూ.14.78 కోట్ల కుళాయి చార్జీలు వసూలు కావలసి ఉందని, వీటిలో ఎక్కువగా మొండి బకాయిలే ఉన్నాయన్నారు. వెంటనే మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని, ఇప్పిటికే జారీ చేసి ఉంటే దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. నగర అభివృద్ధికి పన్నులే కీలకమని పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని నగరవాసులను కోరారు. ఆర్‌వోలు జునైద్, స్వర్ణలత, వాజిత్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

సి.బెళగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిరప పంటను కాపాడుకోవడానికి, తెగుళ్ల నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని ఉద్యానవన అధికారి మదన్‌మోహన్ సూచించారు. వాతావరణ మార్పుల కారణంగా ఆకుముడత, మచ్చ తెగులు వ్యాపించిందన్నారు. ఆకుముడత తెగులు నివారణకు ట్రికోడెర్మ, వేపనూనె పిచికారీ చేయాలన్నారు. పసుపు రంగు బుట్టలను ఏర్పాటు చేసుకుంటే తెగులను కొంత అరికట్టవచ్చన్నారు. ఎరువాక కేంద్రం నిర్వాహకుడు సుజాత, ఎంపీఈవోలు అనిఫ్, వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.



కంబందహాల్‌లో మిరపను పరిశీలిస్తున్న అధికారులు

గర్భిణులకు మెరుగైన వైద్యం చేయాలి

ఓర్వకల్లు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందించాలని సంచార చికిత్స అధికారి డా.రఘు కోరారు. మంగళవారం హుశేనాపురం పీహెచ్‌సీలో డా.సుప్రియ ఆధ్వర్యంలో ఆశా డే నిర్వహించారు. గర్భిణులను గుర్తించి, వివరాలను నమోదు చేయాలని, రక్తహీనత ఉన్నవారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవమయ్యేలా చూడాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి రాబర్ట్, సీహెచ్‌ఎస్ సిల్వజ్యోతి, పర్యవేక్షకులు ప్రకాష్, ఫార్మసిస్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రఘు

9, 10న కర్నూలులో బాలోత్సవం



లోగోను ఆవిష్కరిస్తున్న జి.పుల్లయ్య, జంధ్యాల రఘుబాబు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ఈ నెల 9, 10 తేదీల్లో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ గౌరవాధ్యక్షుడు, రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి.పుల్లయ్య, అధ్యక్షుడు జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయ కోరారు. మంగళవారం ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో లోగోను ఆవిష్కరించారు. తల్లిదండ్రులు పిల్లలతో గడిపే సమయం లేకపోవడం వల్ల పిల్లలు ఫోన్లు, ట్యాబ్‌లకు బానిసలవుతున్నారన్నారు. మార్కులు, ర్యాంకులు, సీట్లు పద్ధతుల్లో విద్యాసంస్థలు ఉన్నాయని, పిల్లల నియంత్రణ ఉపాధ్యాయులకు పెద్ద సమస్యగా మారిందన్నారు. మానసిక ఒత్తిడి నుంచి విద్యార్థులు బయటపడేందుకు బాలోత్సవం దోహదం చేస్తుందన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డా.అక్తర్ బాను, డా.కే.స్వాతి, ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య, పీబీవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

గూడూరు డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదిన గూడూరులో నిర్వహించనున్న ఏఐటీయూసీ మండల మహాసభను జయప్రదం చేయాలని నాయకులు బీడీల శ్రీనివాసులు, ఆటో ఓబులేసు కోరారు. మంగళవారం గూడూరులో ఏఐటీయూసీ హమాలి యూనియన్ ప్రెసిడెంట్ లక్ష్మన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ హమాలీ, ఆటో, భవన నిర్మాణ కార్మికులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. హమాలీలు మద్దిలేటి, శ్రీను, శివ, ఉన్నారు.

విజేతకు ట్రోఫీ ప్రదానం

కర్నూలు ఎడ్యుకేషన్/ఓర్వకల్లు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల విజేతలు స్వాతి, మైత్రికి ట్రోఫీ అందించారు. మంగళవారం మీదివేముల జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్ యాదవ్, పీఈటీలు మల్లికార్జున, అరుణ కుమారిని అభినం దించారు.

రేపు మాస్టర్ అథ్లెటిక్స్ సెలక్షన్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 4వ తేదీన జిల్లాస్థాయి మాస్టర్ అథ్లెటిక్ ఎంపిక నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి వై.రవి కుమార్ తెలిపారు. ప్రవేశ రుసుం రూ.200 చెల్లించి, ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రంతో రావాలని, వివరాలకు 7989328018 నెంబర్లో సంప్రదించాలన్నారు.

ఇళ్ల దరఖాస్తుకు గడువు పొడిగింపు

ఓర్వకల్లు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవై గ్రామీణ 2.0 పథకం కింద నూతన గృహాల మంజూరుకు దరఖాస్తు గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు హౌసింగ్ ఏఈ శ్రీనాథ్ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ అర్హులు గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎంపీ



నారా లోకేశ్‌తో ఎంపీ నాగరాజు

కర్నూలు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులోని టీడీపీ పార్లమెంటరీ కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర మంత్రి నారాలోకేష్‌ను ఎంపీ బస్తిపాటి కలిశారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటున్న ఎంపీ మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటనష్టం అంచనా, సమగ్ర నివేదికను కేంద్ర మంత్రులు అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వివరించేందుకు వచ్చిన మంత్రి లోకేష్‌ను సన్మానించారు. ఎంపీ జిల్లాలో మొంథా తుఫాన్ వల్ల కలిగిన నష్టాన్ని లోకేష్‌కు వివరించారు.

విజయవంతం చేయండి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర బేకరీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) 3వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. మంగళవారం యూనియన్ కార్యకర్తల సమావేశం జి.పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించారు. జనవరి 7న మహసభలు నగరంలో నిర్వహిస్తున్నామన్నారు. బి.వెంకటేష్, జి.చంద్రశేఖర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రేపు సమాఖ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న ఎమ్మిగనూరులో నిర్వహించనున్న మహిళా సమాఖ్య జిల్లా సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి శ్రావణిరెడ్డి కోరారు. మంగళవారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చకుండా మాటలకే పరిమితమైందని విమర్శించారు. రాష్ట్రంలో గంజాయి దందా ప్రభావంతో యువత మత్తులో మహిళలపై దాడులు చేస్తున్నారన్నారు. గిడ్డమ్మ, వి.భారతి, ఉపాధ్యక్షురాలు రేణుక, ప్రభావతి, సుధా, పావని, సులోచనమ్మ, ఆశాబేగం ఉన్నారు.

దుప్పట్ల పంపిణీ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చంద్ర రాజేశ్వరరావు కాలనీలో సర్వనౌ సంస్థ డైరెక్టర్ సుప్రజిత్ సహకారంతో పాస్టర్ జాకోబు వృద్ధులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ కాలనీలో పేదలు ఉండటంతో సంస్థ దుప్పట్ల పంపిణీకి ముందుకు వచ్చిందన్నారు. సి.మహేష్, అశోక్, శేషు, మాణిక్యం పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు అవార్డు



కర్నూలు కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ప్రతినిధి, సామాజిక సేవకుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. నైజీరియా దేశానికి చెందిన డైనమిక్ పీస్ రెస్యూమిషన్ ఇంటర్నేషనల్ పీస్ కీపింగ్ అండ్ పీస్ బిల్డింగ్ అకాడమీ, ఎన్ఐపీఎస్ సంయుక్తంగా అంతర్జాలం ద్వారా అందజేసినట్లు తెలిపారు.

ఓబన్న విగ్రహ ఏర్పాటుకు సహకరించండి



టీడీపీ జిల్లా అధ్యక్షుడితో వడ్డెర సంఘం నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని సంఘం నాయకులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డిని సినీ నటుడు సాతనూరు మంజునాథ్ ఆధ్వర్యంలో విన్నవించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ విగ్రహానికి ఏమీ కావాలో అన్ని రకాలుగా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వడ్డెర సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, జాతీయ అధ్యక్షుడు శ్రీధర్, పారిశ్రామికవేత్త క్రిష్ణయ వేముల భరత్ పాల్గొన్నారు.

అనుగొండలో విద్యుత్ సమస్య పరిష్కరించాలి

కోడుమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండ గ్రామం దళితవాడలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని టీడీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం కర్నూలులోని ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రదీప్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. దళితవాడలో విద్యుత్ కనెక్షన్ లేదని, స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. సమస్యను కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.



ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణారెడ్డి



బహుమతులు పొందిన విద్యార్థులు

కంఠస్థ పోటీలు


కర్నూలు కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్ కాలేజీలో సాంస్కృతిక ఉపన్యాసకుడు, వేమూరి ఆదినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. సిరిమేధ మొదటి బహుమతి రూ.వెయ్యి, పి.కళ్యాణి రూ.500లు, ఎస్.మండోదరి రూ.250లు, ఆర్యాశ్రీరామన్ రూ.1000లు, లలిత క్రిష్ణ రూ.500లు, మూడో బహుమతి రూ.250 అందుకున్నారు కాలేజీ డీన్ కిరణ్ కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వాల్మీకి ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

● వీఆర్‌పీఎస్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ రిజర్వేషన్ సాధనకు వాల్మీకుల ఉద్యమాన్ని ఉధృతం యుమరెరంరటెంల వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సుభాష్ చంద్రబోసు అన్నారు. మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమితి అధ్వర్యంలో గత 18 సంవత్సరాల నుంచి వాల్మీకుల పక్షాల పోరాటం కొనసాగిస్తున్నామని అన్నారు. వాల్మీకులక ఎస్టీ రిజర్వేషన్ సాధించడమే ఏకైక లక్ష్యంగా 2007 డిసెంబర్ 2న వీఆర్‌పీఎస్‌ను ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంటులో ఎస్టీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందే వరకు పోరాటం ఆగదని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాఘవేంద్ర, నగర అధ్యక్షుడు వెంకటరాముడు, నాయకులు నగిరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి తరలిస్తే వాహనాలు సీజ్



ఎర్రమట్టిని పరిశీలిస్తున్న అధికారులు

సి.బెళగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే వాహనాలను సీజ్ చేయాలని మైనింగ్ అధికారులు మహేశ్వర రెడ్డి, ఎల్లయ్య ఆదేశించారు. మంగళవారం మండలంలోని కబందహాల్, సిబెళగల్, పోలకల్లు, బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, చింతమానుపల్లె, సంగాల గ్రామాలను రెవెన్యూ అధికారులు, ఎస్ఐతో కలిసి పరిశీలించారు. ఎర్రమట్టి తరలించే సమాచారం ఇస్తే వారి పేర్లను రహస్యంగా ఉంచుతామన్నారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఓర్వకల్లు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ఈ నెల 31 నుంచి 2026 జనవరి 5 వరకు నిర్వహించనున్న అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు గోపాల్ కోరారు. మంగళవారం నన్నూరు పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలన్నారు. కార్మికులు, స్కీమ్ వర్కర సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామ న్నారు. షాజహాన్, శ్రీధర్, ఆశా వర్కర్లు కాంతమ్మ, సరోజ, సుశీల, సుజాత, రేణుక పాల్గొన్నారు.

నేడు వెల్దుర్తికి ఎమ్మెల్యే రాక

వెల్దుర్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన వెల్దుర్తికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు బుధవారం రానున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ బాలచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో నూతన 'ఎక్స్‌రే' యంత్రాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

డీఎస్పీ మర్రిపాటి హేమలత



మాట్లాడుతున్న డీఎస్పీ మర్రిపాటి హేమలత

ఆదోని అగ్రికల్చర్ , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ మర్రిపాటి హేమలత అన్నారు. మంగళవారం ఈగల్ టీం ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంపై డాక్టర్ జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. జీవితం ఎంతో విలువైనదని చదువుతోనే ఉన్నతమైన శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలపై వివరించారు. ప్రిన్సిపాల్ మురళీ బాబు, కానిస్టేబుల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

తల్లులకు అవగాహన సదస్సు

ఆదోని టౌన్ , డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి) : వివిధ లోపాలతో జన్మించిన పిల్లల విషయంలో తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో మంగళవారం హ్యాబిలిటేషన్ డే సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న పట్టణానికి చెందిన పిల్లల వైద్యులు తల్లులకు అనేక అంశాలలో అవగాహన కల్పించారు. వివిధ వైకల్యాలతో జన్మించిన చిన్నారులు స్వయంగా వారి పనులను వారే చేసుకునేలా ఎలా తర్ఫీదు ఇవ్వాలో తల్లులకు డాక్టర్లు వివరించారు. డా. గోపీనాథ్, డా. రఘునాథ్, డా. హరీష్, డా. ఆదిత్య, డా. శ్రీలక్ష్మీ, డా. బాలాజీ, డా. సందీప్, డా. కిరణ్, డా. మధు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పత్తికొండ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో సీపీఎం నాయకుడు పెంచలయ్య హత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి, మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి రవిచంద్రలు డిమాండ్ చేశారు. కాశన్న, దుగ్గన్న, నరసన్న, రంగస్వామి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి దరఖాస్తు

ఆదోని అగ్రికల్చర్ , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నియోజవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న సబ్జెక్టు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి భూపాల్ రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈనెల 5లోపు ఆర్ట్స్ కళాశాల రహదారిలోని మండల విద్యాశాఖ అధికారి ఎంఆర్‌సీ భవనంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లకు రూ. 12,500, ఎస్‌జీటీలకు రూ.10,000 గౌరవ వేతనం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఎంఆర్‌సీ భవనంలో సంప్రదించాలని సూచించారు.

ఇళ్ల దరఖాస్తులకు గడువు పొడిగింపు

మద్దికెర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్థలాలు ఉండి ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 2.0 పథకం కింద నూతన గృహాల కొరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించిందని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ తెలిపారు. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంజీఎస్‌డబ్ల్యూ ఆఫీసర్‌గా లక్ష్మీనరసమ్మ

వెల్దుర్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మండల లెవల్ గ్రామసచివాలయ అధికారిగా లక్ష్మీనరసమ్మ వెల్దుర్తి మండలానికి నియమితులయ్యారు. కర్నూలు జిల్లాపరిషత్‌లో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై వెల్దుర్తికి వచ్చారు. అలాగే లక్ష్మీనగరం పంచాయతీ కార్యదర్శిగా శ్రవణ్‌కుమార్, సూదేపల్లి పంచాయతీ కార్యదర్శిగా వెంకటనాయుడు పదోన్నతిపై నూతన బాధ్యతలు చేపట్టారు.

నీటి సమస్యను పరిష్కరించండి

మద్దికెర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలో నేసేవీది, వడ్డె వీది, కురువ వీది ప్రాంతాల్లో వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య పరిష్కరించాలని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పారా విరోభ కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ మంచినీరు అందించేందుకు ప్రత్యేక పైపులైన్ కూడా వేయడమే కాకుండా జల్‌జీవన్ కింద ఇంటింటికి కొళాయి అందించి ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు. టీడీపీ నాయకులు గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు

హాలహర్వి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు 7 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో వరలక్ష్మి మంగళవారం తెలిపారు.

పశుపోషణపై ఆసక్తి పెంచుకోవాలి

దేవనకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాప్రాంతాల్లో ప్రజలు పశుపోషణపై ఆసక్తి పెంచుకోవాలని డీఎల్‌డీఏ ఉపసంచాలకులు డాక్టర్ రాజశేఖర్, సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కొత్తపేటలో రాష్ట్రీయ గోకుల మిషన్ లోభాగంగా ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి వెంకటేష్, వైద్యాధికారి వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

తూము ఏర్పాటు చేయాలి

చిప్పగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కెనాల్ నుంచి హెచ్ఎల్‌సీ కాలువకు శాశ్వత తూము నిర్మించాలని మంగళవారం చిప్పగిరి పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ డా.సిరిని కోరినట్లు సొసైటీ ఛైర్మన్ కొండా రామాంజినేయులు, సర్పంచ్ కొండా పురుషోత్తం, బీజేపీ నాయకులు తిమ్మప్ప తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయాలి

పత్తికొండ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో ఈనెల 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగనున్న సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి రవిచంద్ర పిలుపునిచ్చారు. ఆశావర్కర్లు రామలక్ష్మి, క్రిష్ణవేణి, రమాదేవి, సరస్వతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రకటించే దాకా

ఉద్యమాన్ని విరమించేది లేదు

- ఆదోని జిల్లా పోరాటానికి వైసీపీ సీనియర్ల మద్దతు
- వైసీపీ అధికారంలోకి రాగానే జగన్‌తో మాట్లాడి ఆదోనిని జిల్లాగా ప్రకటిస్తాం : బుట్టా రేణుక
- దీక్షకు మద్దతు ఇచ్చిన వైసీపీ నేతలు బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న వైసీపీ సీనియర్ నాయకురాలు బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించే వరకు తమ పోరాటాన్ని విరమించేది లేదని వైసీపీ సీనియర్ నాయకురాలు బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. ఆదోనిని జిల్లాగా చేయాలనే డిమాండ్ జరుగుతున్న నిరాహార దీక్షా శిబిరాన్ని మంగళవారం సందర్శించి, తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు.

● జిల్లా అయ్యేంతవరకు ఉద్యమిస్తాం

ఆదోని జిల్లా అయ్యేంతవరకు ఉద్యిస్తామన్నారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడారు. ఆదోని జిల్లా ఆకాంక్ష ఈ ప్రాంత ప్రజల హక్కు అని, ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఈ డిమాండ్‌ను నెరవేర్చకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

బుట్టా రేణుక ఆసక్తికర వ్యాఖ్యలు: ఆదోనిని జిల్లాగా ప్రకటించకపోతే తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి, ఆదోనిని జిల్లాగా సాధించుకుంటామని బుట్టా రేణుక హామీ ఇచ్చారు. ఈ విషయంలో పార్లమెంటులోని నియోజకవర్గంలోని వైసీపీ నాయకులంతా జగనన్నను అభ్యర్థిస్తారని ఆమె స్పష్టం చేశారు. ఆదోనిని వెంటనే జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఆదోని చుట్టుపక్కల నియోజకవర్గాలన్నింటికీ కేంద్రంగా ఉంటుందని, కర్నూలుకు 110 నుంచి 130 కి.మీ. ప్రయాణించాల్సిన ఇబ్బందులు తొలగిపోతాయని బుట్టా రేణుక తెలిపారు. ఆదోనిని జిల్లాగా చేయాలని ప్రజలు ఎంత బలంగా కోరుకుంటున్నారో కూటమి ప్రభుత్వం గమనించాలని ఆమె కోరారు. ఒకప్పుడు సెకండ్ బాంబే అని పిలిచే ఆదోనిని రాయలసీమలోని పశ్చిమప్రాంత అభివృద్ధి కోసం జిల్లాగా చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

చిప్పగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డాక్టర్ సిరి మంగళవారం చిప్పగిరి మండలంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు అధికారులను హడలెత్తించాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆమె విద్యార్థులతో మాట్లాడారు. టీవీ, ఫోన్ మంచివే... కానీ హద్దు మీరితే జీవితాలను నాశనం చేస్తాయన్నారు. వాటిని అరగంట మాత్రమే చూడాలని సూచించారు. బడికి రాని పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాలకు రాకుంటే తల్లిదండ్రులతో మాట్లాడి బడికి వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. విషయంపై స్థానిక అధికారులపై ఉపాధ్యాయులపై మండిపడ్డారు. ఆలూరు నియోజకవర్గానికి రూ.24 కోట్లు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు మరుగుదొడ్లు నిర్మించాలని స్థానికులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి ఉత్తీర్ణత పెంచేందుకు చేపట్టాల్సిన ప్రణాళికపై ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో ఎంఈఓ సావిత్రిపై ఆగ్రహించారు. వారంలోగా మరమ్మతులు చేయించాలన్నారు. ఆమె వెంట కర్నూలు డీఈఓ శామ్యూల్‌పాల్, తహసీల్దార్ ఇజాజ్‌అహ్మద్, ఎంపీడీఓ అల్లాబకాష్, ఎంఈఓలు సావిత్రమ్మ, ఎండీఓ ఫరూక్, ఏఈలు సోమప్ప, వెంకట్‌రమణి, విద్యాకమిటీ ఛైర్మన్ కొక్కు నాగరాజు, పంచాయతీ రాజ్ ఏఈ సోమప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణమ్మ, ఏఓ రామ్‌ప్రవీణ్, విద్యుత్ ఏఈ జంబన్న తదితర అధికారులు ఉన్నారు.

వైకల్యం ప్రతిభకు అడ్డు కారాదు: ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైకల్యం వారి ప్రతిభకు అడ్డుకారాదని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం పత్తికొండ భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష విద్యావిభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవసరాలు పిల్లలకు వైకల్యపు పరీక్షల ప్రత్యేక క్యాంపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వేద క్రీడల్లో ప్రతిభ చూపిన ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ డా.బీఎస్ లోక్‌రాజు, జిల్లా సహిత విద్యాకోఆర్డినేటర్ సురేంద్ర బాబుజి, ఎంఈవోలు రాజారామ్ మోహన్, రమేష్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించుకోని కట్టడాలపై కఠిన చర్యలు

ఆదోని టౌన్ , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్లాను మంజూరు లేకుండా నిర్మించిన కట్టడాలను క్రమబద్ధీకరించుకొనే అవకాశాన్ని కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన బీపీఎస్(బిల్డింగ్ పినలైజేషన్ స్కీం) ను వినియోగించుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారి బాలమద్దయ్య తెలిపారు.గడువులోగా క్రమబద్ధీకరించుకోని నిర్మాణాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

ఆదోని అగ్రికల్చర్ , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద హరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేల ఆరోగ్యం, మట్టి నమూన పరీక్షలపై మంగళవారం విద్యార్థులకు ఎమ్మిగనూరు భూసార ల్యాబ్ వ్యవసాయ అధికారి లావణ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కేబికే శాస్త్రవేత్త తేజ, ప్రధానోపాధ్యాయుడు రామచంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు చిరంజీవి, నవీన్, మహాలింగమ్మ, రవీంద్ర పాల్గొన్నారు.

చిక్కీలు వచ్చాయి..



చిక్కీలు అందిస్తున్న కాంట్రాక్టర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దికెర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు ప్రభుత్వం అందించే చిక్కీలను ఎట్టకేలకు సరఫరా చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన గడువు ముగిసిన చిక్కీలు అనే వార్తకు స్పందించిన జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సదురు కాంట్రాక్టరు గ్రామంలోని బాలుర పాఠశాలకు రెండు నెలల పాటు సరిపడ చిక్కీలను ప్రధానోపాధ్యాయులు మోహన్‌కు అందజేశారు. ఎంఈవోలు రంగస్వామి, మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గడువు ముగిసిన చిక్కీలను సరఫరా చేయడంతో వెనక్కు పంపామని, కొత్త చిక్కీలు అందించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

పెండింగ్ గృహాలను పూర్తి చేసుకోవాలి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

వెల్దుర్తి టౌన్/వెల్దుర్తి డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో దాదపు 300లకుపైగా పెండింగ్‌లో ఉన్న గృహాలను 2026 మార్చి నెలలోపు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ చిరంజీవి మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో, ఇన్‌చార్జి హైసింగ్ ఇంజనీరింగ్ ఏఈ బాలకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు గిడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి బస్సు నడిపిన డ్రైవర్లకు జైలు శిక్ష

ఆదోని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి బస్సులు నడుపుతున్న ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని మంగళవారం కోర్టులో హాజరు పరచగా వారిని రిమాండ్‌కు ఆదేశించారు. టూటౌన్ సీఐ రాజశేఖరరెడ్డి తెలిపిన వివరాల మేరకు.... బళ్లారి నుంచి హైదరాబాద్ వెళ్తున్న గీతా ట్రావెల్స్, ఐవీఆర్ఎస్ ట్రావెల్స్ స్లీపర్ బస్సులను తనిఖీ చేశారు.బస్సు డ్రైవర్లు గణేష్, సుధీర్‌లు మద్యం తాగినట్లు బ్రీత్ అనలైజర్ ద్వారా నిర్ధారించారు. ప్రయాణికులతో ఉన్న స్లీపర్ బస్సులను మద్యం తాగి నడపడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ఆదోని ఫస్ట్ అడిషనల్ మెజిస్ట్రేట్ సుభాష్ బస్సు డ్రైవర్ గణేష్‌కు 15 రోజులు, మరో బస్సు డ్రైవర్ సుధీర్‌కు 7 రోజులు జైలు శిక్ష విధించారు.

టీజీ వెంకటేష్‌ను కలిసిన గుమ్మనూరు నారాయణ

ఆలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్‌ను మంగళవారం కర్నూలులో మర్యాదపూర్వకలంగా కలిసినట్లు ఆలూరు మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, బీజేపీ నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ తెలిపారు. జిల్లా అధ్యక్షులు రామకృష్ణ ఆధ్వర్యంలో కలిసి, ఈనెల 12న కర్నూలులో ఆవిష్కరించనున్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహ ఆవిష్కరణకు ఆలూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని టీజీ వెంకటేష్ సూచించినట్లు వారు తెలిపారు.

పెద్దహరివాణం మండలం మాకొద్దు...



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆదోని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు



ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళా సమాఖ్య సంఘం నాయకురాళ్లు

- ఆదోని మండలంలోనే కొనసాగించాలని గ్రామ ప్రజల ఆందోళన
- కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన

ఆదోని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెద్దహరివాణం మండలం మాకొద్దని ఆదోని మండలంలోనే తమ గ్రామాలను కొనసాగించాలని చాగి, బసాపురం, మదిరె, నారాయణపురం, కడితోట, గణేకల్, చిన్నగోనేహాళ్, డణాపురం గ్రామాల ఆయా పార్టీల నాయకులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు;రెండు, మూడు రోజులుగా మండలంలో వివిధ రూపాల్లో ఆందోళన చేపడుతున్న నాయకులు, ప్రజలు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి వేర్వేరుగా ఆందోళన చేపట్టడంతోపాటు తమ గ్రామాలను పెద్దహరివాణం మండలంలో కలపవద్దని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, గణేకల్ విరుపాక్షి, రామస్వామి, రాముడు, మల్లికార్జున, చంద్ర, ఈరన్న గౌడ్, మల్లికార్జున, తదితరులు మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే పెద్దహరివాణం మండలం నుండి తమ గ్రామాలను తొలగించి ఆదోనిలోనే కొనసాగించాలని లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు

బసాపురం గ్రామాన్ని ఆదోనిలోనే కొనసాగించాలి: బసాపురం గ్రామాన్ని ఆదోని మండలంలోనే కొనసాగించాలని ప్రగతీ శీల మహిళ సంఘం నాయకురాలు మణి కోరారు. నూతనంగా ఏర్పడ్డ పెద్దహరివాణం మండలంలో బసాపురం గ్రామాన్ని కలపడం హాస్యాస్పదమన్నారు. ఆదోనికి కూతవేటు దూరంలో ఉన్న బసాపురాన్ని కర్ణాటకకు కూతకువేటు దూరంలో ఉన్న పెద్దహరివాణంలో ఏలా కలుపుతారని ఆమె ప్రశ్నించారు. తక్షణమే అధికారులు విచారణ చేపట్టి తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరిస్తూ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో "ఆదోనిసబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. మంగళవారం హులేబీడు, హత్తిబెళగల్ గ్రామాల్లో రూ.30 లక్షలతో సీసీ రోడ్డ, అంగన్‌వాడీ నూతన భవనం, గోకులం షెడ్డు నిర్మాణం పనులను టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, నారా లోకేష్ పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచ దేశాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ బిల్లేకల్ వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో ఛైర్మన్ బేవిన ఈరన్న, టీడీపీ సీనియర్ నాయకులు కటారుకొండ శ్రీనివాసులు, రహిమాన్, ఈరన్న, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కేశన్న, పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

మద్దికెర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామానికి మజరా గ్రామమైన బొజ్జనాయునిపేట గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 15 రోజులుగా నీరు వదలడం లేదు అనే వార్తకు స్పందించిన వారు గ్రామానికి వెళ్లి నీటి పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకు బోరు ద్వారా నీరు సరఫరా చేస్తున్నామనీ, అయితే.. తరుచూ మోటారు కాలిపోతుందన్నారు. చెడిపోయిన మోటారును బాగు చేయించి నీరు వదులుతామని గ్రామస్థులకు తెలిపారు.

'ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదు'

ఆలూరు(హొళగుంద), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల కోసం నిరంతరం పాటుపడే ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షిని విమర్శించే అర్హత సింగిల్ విండో అధ్యక్షులు హెబ్బటం విష్ణువర్ధన్‌రెడ్డికి లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీ ఉల్లా అన్నారు. గిరి, ఎంపీటీసీ మల్లికార్జున, ఆనందగిరి, ఇమ్రాన్, శేషు, అబ్దుల్లా, హెబ్బటం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి మహిళ లక్షాధికారి కావాలి : వెలుగు పీడీ

హాలహర్వి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల సభ్యులంతా బ్యాంకుల ద్వారా, స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళ లక్షాధికారి కావాలని వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణారెడ్డి అన్నారు. ప్రతి సభ్యురాలు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించే వ్యాపారాలు ప్రారంభిస్తే నెలనెలా ఆదాయాలు పొందవచ్చన్నారు. ఏరియా కో ఆర్డినేటర్ నవీన్, ఏపీఎం నాగార్జున, సీసీలు ఆంజనేయులు, నరసింహులు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోతున్నాయ్

- కంపెనీ వ్యర్థాల నుంచి పంటలను కాపాడండి
- బొండ్లవానిపల్లెకు ప్రత్యేక పంచాయతీని ఏర్పాటు చేయాలని జేసీకి వినతి



జియో మైసూరు కంపెనీని పరిశీలిస్తున్న జేసీ

తుగ్గలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జియో మైసూరు కంపెనీ నుంచి వచ్చే వ్యర్థాల వల్ల భూగర్భజలాలు కలుషితమై మా పంటలు ఎండి పోతున్నాయని రైతులు జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌కు రైతులు విన్నవించారు. శనివారం మండల పరిధిలోని బొండ్లవానిపల్లెకు చెందిన 7 మంది రైతుల పంట పొలాలను, జామ, సపోట తోటలను జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించారు. మొక్కలు ఎందుకు ఎండిపోతున్నాయో అందుకు సంబంధించిన శాస్త్రవేత్తలను పిలిపించి పరిశీలిస్తామన్నారు. అలాగే అక్కడకు చేరుకున్న బొండ్లవానిపల్లె గ్రామస్థులు ఇప్పటివరకు పగిడిరాయి మజరా గ్రామంగా ఉందని, మా గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా చేయాలని జేసీని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్‌కు బీజేపీనాయకులు, కార్యకర్తలు, జియో మైసూరు కంపెనీ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా నిర్మించిన జియో మైసూరు కంపెనీని ఆయన పరిశీలించారు రైతుల పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామనీ జేసీ హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం అన్ని విధాలుగా చర్యలు తీసుకునేలా కంపెనీ యజమానులతో మాట్లాడుతామని రైతులకు హామీ ఇచ్చారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమసుందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గీతా మాదురి, ఆర్డీవో భరత్ నాయక్, తహసీల్దార్ రవి, జియో మైసూర్ డైరెక్టర్ మానసరంజన్ బిశ్వాల్, ఆర్ఐ వెంకట్రాముడు, సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు రంగన్న, రాజేశ్వరి ఉన్నారు.

వంతెన నిర్మించాలి

దేవనకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అలారుదిన్నె హంద్రీపై వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని వంతెన నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకులు వీరశేకర్, ఆస్పరి మండల కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. వంతెన నిర్లక్ష్యంపై 6న వంతెన వద్ద ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. యూసుఫ్‌బాష, ఆశోక్, నాగేంద్ర, బలరాముడు, పాల్గొన్నారు.

జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం

ఆదోని అగ్రికల్చర్ , డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సెయింట్ ఆంథోని ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీ చేపట్టారు. మారెన్న, సిస్టర్ రేణుక శామ్యూల్ వరప్రసాద్ రవి సంధ్య పాల్గొన్నారు.

విద్యార్థులను ఆకట్టుకోవాలి

ఆదోని అగ్రికల్చర్ , డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి) : వినూత్నమైన బోధనతో విద్యార్థులను ఆకట్టుకుంటే వారిలో చదువుపట్ల ఆసక్తి కలిగించవచ్చని డిప్యూటీ ఈవో రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం 10వ తరగతి బోధిస్తున్న సబ్జెక్టు ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, మల్లికార్జున అనంతరం రిసోర్స్ పర్సన్స్ సుధాకర్ ఆదిమూర్తి పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల అభివృద్ధే లక్ష్యం: చైర్మన్



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీలేఖ

నందవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నందవరంలోని కేజీబీవీ పాఠశాల అభివృద్ధే లక్ష్యమని విద్యాకమిటీ చైర్మన్ భీమన్న అన్నారు. మంగళవారం పాఠశాలలో దాతల సహకారంతో వాలీబాల్ గ్రౌండ్ ఏర్పాటు చేశారు. పీఈటీ శిరోమణి ఆధ్వర్యంలో ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు డాక్టర్ శ్రీలేఖ, ఏవో సరిత, మాట్లాడుతూ విద్యతో పాటు ఆటలు కూడా ముఖ్యమేనని వారన్నారు. విద్యార్థులకు మానసిక సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రశాంతమైన వాతావరణంలో క్రీడలు ఆడాలని తెలిపారు. విద్యార్థులు క్రీడా రంగంలో కూడా రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని వారు కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవి, జనసేన మండల అధ్యక్షుడు ఎల్లప్ప, తుగ్గలి ఈరన్నగౌడు, వైస్ చైర్మన్ సునిత, చంద్ర, ఇర్ఫాన్, రామలింగాడు, శకంర్, పవన్, ఆంజి, బంగారి, నరసింహులు పాల్గొన్నారు.

ముగతి పాఠశాల విజిట్

నందవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముగతి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలను మంగళవారం తహసీల్దారు శ్రీనివాసులు విజిట్ చేశారు. పాఠశాలోని విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. బడి ఈడు పిల్లలలు బడి బయట ఉంటే వారిని వెంటనే పాఠశాలలో చేర్పించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు కాసేపు పాఠలు చెప్పారు. అనంతరం తహసీల్దారు అయ్యానని అన్నారు. ఉపాధ్యాయులు మీకు అర్థమైయ్యే విధంగా పాఠాలు చెపుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు.

మంత్రాలయంలో జనసేన అభివృద్ధికి కృషి

మంత్రాలయం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రాలయం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్రఐక్య వాల్మీకి పోరాట కమిటీ అధ్యక్షులు బీ లక్ష్మన్న అన్నారు. మంగళవారం హైదరాబాద్ లో ఏపీ రాష్ట్ర జనసేన పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్, రాష్ట్ర టిడ్కో చైర్మెన్ అజయ్‌కుమార్‌ను కలిసి రాఘవేంద్ర స్వామి మెమెంటో, పరిమళ ప్రసాదం ఇచ్చారు.



అజయ్‌కుమార్‌కు మెమెంటో, ప్రసాదం ఇస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్ చార్జీ బీ.లక్ష్మన్న

విద్యా వలంటీర్ కోసం దరఖాస్తు చేసుకోండి

మంత్రాలయం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా పాఠశాలలకు కేటాయించిన విద్యా వలంటీర్ పోస్టులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రాగన్న అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి ఆయా సబ్జక్టులు మీడియంల ఆధారంగా విద్యా బోధకులుగా డిగ్రీ, బీఈడీ చేసిన అభ్యర్థులు ఈనెల 5వ తేదీ లోపుగా ఎంఆర్సీ భవనంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండలంలో, గ్రామాలో ఉన్న స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇందుకు కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా విద్యాశాఖ అధికారి కన్వీనర్‌గా, డైట్ ప్రిన్సిపాల్ లేదా డిప్యూటీ డీఈఓ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పాఠశాలలో బోధించాల్సి ఉంటుందని తెలిపారు.

కౌతాళం: మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు అర్హులైన వారు ఈ నెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారులు రామాంజనేయులు, శోభారాణిలు కోరారు.మండలంలో ఖాళీ వివరాలు ఇలా ఉన్నాయి. కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హింది, కన్నడ, భౌతిక శాస్త్రం కన్నడ, జీవ శాస్త్రం కన్నడ, రౌడూరు ఉన్నత పాఠశాల యందు ఎస్‌ఏ కన్నడ, భౌతిక శాస్త్రం కన్నడ, కామవరంలో ఎస్‌ఏ తెలుగు, కుంబళనూరు, హల్వి, ఎరిగేరిలో ఎస్‌ఏ హింది, ఎస్‌ఏ కన్నడ సుళేకేరి, కుంటనహల్, బదినేహల్‌లో ఎస్‌ఏ గణితము, పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తును ఈ నెల 5వ తేదీలోపు ధరఖాస్తు చేసుకోవాలన్నారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహారించారు. మంగళవారం ద్వాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. మఠం పండితులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

ఆదోని జిల్లా కోసం ఉద్యమిద్దాం

● జిల్లా చేసేంత వరకు పోరాటాలు ఆగవు ● విద్యార్థులు, ప్రజాసంఘాల ఆందోళన



డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆదోనిని జిల్లాగా చేయటంతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, అందుకోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని విద్యార్థి, ప్రజాసంఘాల జెఏసీ నాయకలు శేఖర్, కామళే గణేష్, రాజు, కృష్ణ, ఖాజా, రాజీవ్, ఉదయ్, బతకన్న, అఫ్రీది, రఘు అన్నారు. ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని మంగళవారం విద్యార్థి, ప్రజాసంఘాల జేఏసీల ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి సోమప్ప సర్కిల్‌లో మానవహారం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కరువు, వలసలు నివారణకు ఏకైక మార్గం ఆదోనిని జిల్లా చేయటమేనన్నారు. కర్నూలు జిల్లాలో వెనుకబడినటువంటి ప్రాంతమైన ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలతో కూడిన ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించే వరకు పోరాటం ఆగదన్నారు. ఆదోని జిల్లాగా ఏర్పడితే ఈ ప్రాంతంలో యునివర్శిటీ, వైద్యశాలలు, పారిశ్రమలు ఏర్పాటవటంతో పాటు ఇరిగేషన్ ప్రాజెక్టులకు పెద్దఎత్తున నిధలు మంజూరు అవుతాయన్నారు. ఆదోనిని జిల్లాగా ప్రకటించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, నాయకులు నడుం బిగించాలన్నారు. అనంతరం డీటీకి ప్రజా,విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, ఈరమ్మ, బలరాం, నాగరాజు, చార్లెష్, అమరెష్, అనీఫ్, ఏసోపు, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఆదోనిని డివిజన్ వెనుకబడిన ప్రాంతం. ఆదోనిని జిల్లా కేంద్రం చేస్తే అన్ని రకాల అభివృద్ధి చెందుతుంది. ఎన్నో ఏళ్ల నుంచి పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. జిల్లా చేసే వరకు పోరాటాలు ఆగవని ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆందోళనలు ఉధృతం చేస్తున్నాయి. మంగళవారం ఎమ్మిగనూరులో భారీ ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపట్టారు.

మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది

ఆదోనిని జిల్లా చేయటం వల్ల రాయలసీమలోని కర్నూలు పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎంపీ, కర్నూలు పార్లమెంట్ వైసీపీ సమన్వయకర్త బుట్టా రేణుక అన్నారు. మంగళవారం పట్టణంలోని శిల్పా కాలనీలో ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆదోనిని జిల్లా చేయాలని ప్రజలు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలుపుతున్నామన్నారు. ఆదోని జిల్లా చేయటం వల్ల ఆదోనితో పాటు ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం నియోజకర్గాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా కావటం వల్ల నిధులు అధికంగా విడుదలయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఒకప్పుడు ఆదోనిని రెండో బొంబాయిగా పిలిచేవారని, జిల్లా చేయటం వల్ల దాన్ని తిరిగి పొందిన వాళ్లమవుతామన్నారు. జిల్లా పోరాటానికి వైసీపీ ఎల్లప్పుడు మద్దతు ఇస్తుందన్నారు. అనంతరం దాదాపు 40వాహనాల్లో ఆదోనికి బయలుదేరి వెళ్లారు. సమావేశంలో నాయకులు వైసీపీసీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ, యూత్ రాష్ట్ర ఉపాధ్యాక్షులు ప్రతూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్, జిల్లా ఉపాధ్యాక్షులు కేఆర్ మురహరి రెడ్డి, శివప్ప గౌడ్, రామకోటి రెడ్డి, నాగేష్ నాయుడు, నాగేషప్ప, శ్రీనివాసరెడ్డి, విరుపాక్షి రెడ్డి, చేనేతమల్లి,ఉరుకుందు గౌడ్, బజారి పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి

కోసిగి: ఆదోని జిల్లా సాధనే లక్ష్యంగా నిర్వహించే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోసిగి చెందిన ఆదోని జిల్లా సాధన జేఏసీ సభ్యులు ఎం. రాజు పిలుపునిచ్చారు. మంగళవారం కోసిగిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మద్రాసు రాజధానిగా ఉన్న కాలంలోనే ఆదోని మున్సిపాలిటీగా అవతరించిందని, వలసలకు పశ్చిమ ప్రాంతమైన ఆదోనిని జిల్లా చేసి కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన అన్నారు. కర్నూలు జిల్లా కేంద్రం ఆదోని ప్రాంత వాసులకు సుమారు 100 నుంచి 130 కిలోమీటర్లు ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆదోనిని జిల్లా చేస్తే 5 నియోజకవర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్, ఈరేష్, నాగరాజు, మల్లి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో మానవహారంగా విద్యార్థులు



ర్యాలీగా వస్తున్న విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

కుతంత్ర రాజకీయాలు కాదు.. అభివృద్ధే ముఖ్యం

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనకు కుతంత్ర రాజకీయాలు అవసరం లేదని.. అభివృద్ధే ముఖ్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఎవరైనా గ్రామంలో అభివృద్ధికి అడ్డుపడితే ఎవ్వరిని సహించేదిలేదన్నారు. మంగళవారం మండలంలోని పెసలదిన్నె గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రూ.10లక్షతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గ్రామంలో ఉన్న వృద్ధులు, వితంతువులు, వికలాంగులను కలుసుకొని ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్ సక్రమంగా అందుతుందా..లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉన్నాయాలేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పెసదిన్నె గ్రామంలో కొంతమంది స్వార్థరాజకీయాలు చేస్తూ గ్రామాభివృద్ధిని ముందుకు సాగనివ్వడం లేదన్నారు. వైసీపీ నాయకులు ఒక్క అభివృద్ధి పనికూడా చేయలేదన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు, గ్రామ టీడీపీ నాయకులు కురువ అనుమంతు, యర్రన్న, శ్రీనివాసులు, తాయప్ప, శ్రీను, కేశన్న, సుందర్‌రాజు, మాబాషా, పటేల్, వీరయ్య ఆచారిలతో పాటు మండల టీడీపీ నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎర్రిస్వామి

ఎమ్మిగనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం కోటేకల్ గ్రామానికి చెందిన గేటు ఎర్రిస్వామి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. గత నెలలో ఏబీవీపీ 71వ జాతీయ మహాసభలు డెహ్రాడూన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేకల్ గ్రామానికి చెందిన గేటు ఎర్రస్వామిని జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేసినట్లు ఏబీవీపీ జాతీయ అధ్యక్షుడు డా రఘురాజ్ కిషోర్ ప్రకటించినట్లు ఎర్రిస్వామి తెలిపారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తునే ఉంటామన్నారు. ఎర్రిస్వామిని జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నిక కావటం పట్ల కర్నూలు జిల్లా ఏబీవీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



ఉద్యోగాలు కల్పించాలి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటి పరిధిలో పారిశుధ్య పని చేస్తూ మృతి చెందిన 13 మంది కార్మికుల కుటుంబ సభ్యులకు మానవతా దృక్పథంతో కారుణ్య నియమాకం కింద ఉద్యోగాలు ఇచ్చి అదుకోవాలని వైసీపీ కర్నూలు పార్లమెంట్ ఇన్‌చార్జీ బుట్టా రేణుక పేర్కొన్నారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట 16వ రోజు రీలే నిరాహార దీక్షలు కొనసాగించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శిలు రంగన్న, ఏఐటియుసి నాయకులు తిమ్మగురుడు, విజయేంద్ర, ఎల్లప్ప, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

ఆశా వర్కర్లు సక్రమంగా విధులు నిర్వర్తించాలి

కోసిగి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ప్రభుత్వ వైద్యులు డా.కిరీటీ, డా.అభిరూప్ అన్నారు. మంగళవారం కోసిగి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాలను ఉద్దేశించి వైద్యులు డా. రాజ్ కిరిటీ మాట్లాడుతూ ఆశా వర్కర్లు సీజనల్ వ్యాధుల పట్ల, మాతా శిశు సంరక్షణ పట్ల, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాలలోపు పిల్లలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇంటి వద్దకు వెళ్లి పిల్లల తల్లులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు అభిరూప్, మౌనిక, వైద్యసిబ్బంది ఈశ్వరమ్మ, కోటేశ్వరమ్మ, శ్రీనివాసులు, ఎల్లప్ప, రాముడు, జయమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా. రాజ్‌కిరిటీ

నూతన ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక

కౌతాళం, డిశంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ)సంస్థ ఎల్లవేళలా పోరాడుతుందని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న అన్నారు. కౌతాళంలో మంగళవారం మండలంలోని ఉపాధ్యాయ సమస్యలను తెలుసుకుని వాటిని మండల విద్యాధికారి-2 శోభారాణికి ఉపాధ్యాయులతో కలిసి వినతి పత్రం అందజేశారు. మండల అధ్యక్షుడిగా అంజినయ్య, ప్రధాన కార్యదర్శిగా ఖాదర్‌బాషా, ఆర్థిక కార్యదర్శిగా పరమేష్ ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎస్టీయు జిల్లా ఆర్థిక కమిటీ రామాంజనేయులు, జిల్లా కౌన్సిలర్లు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు గురు రాజా, మౌనేష్, ఈరన్న, ఆనంద్ రాజు, శాలిబాషా, దామోదర్ ఉన్నారు.

ఓటరు లిస్టుల తప్పు ఒప్పులను సరి చేయాలి

కోసిగి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓటర్ల వెరిఫికేషన్‌లో తప్పు ఒప్పులను గుర్తించి ఖచ్చితంగా ఓటరు లిస్టును సరి చేయాలని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు లిస్టుల వెరిఫికేషన్‌లో తప్పులను గుర్తించి అలాగే మరణ కేసులను తొలగించాలని, మరణలను, డబుల్ ఎంట్రీలను తొలగించాలని, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన వారికి నూతన ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిక్షయ మిత్రులకు సర్టిఫికెట్ల పంపిణీ

పెద్దకడబూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పేద క్షయ వ్యాధిగ్రస్తులకు ఐదు నెలల పాటు పోషకాహార కిట్లను ఇచ్చినందుకు గాను దాతలకు నిక్షయమిత్ర సర్టిఫికెట్లను ఎంవోటీసీ వైద్యులు శేఖన్‌బాను, మెడికల్ అధికారి డాక్టర్ ఫిర్దోస్, కేజియా అందజేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు పొగాకు, ఆల్కాహాల్ అలవాటు ఉన్న వారికి 60ఏళ్లు పైబడిన వారికి క్షయవ్యాధి లక్షణాలు కలిగిన ప్రతి ఒక్కరు గళ్ల పరీక్షలు ఎక్స్‌రేలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఆదినారాయణ, శ్రీధర్, సుశీల, భాస్కర్, బాబురాజు, లక్ష్మి నరసమ్మ పాల్గొన్నారు.



నిక్షయ మిత్రులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వైద్యులు

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

కోసిగి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో మట్టి ఆరోగ్యంపై మోడల్ స్కూల్ విద్యార్థులకు మండల వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. మంగళవారం కోసిగిలో మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో భూసార పరీక్ష కేంద్రం ఎమ్మిగనూరు అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్, అధికారులు కిరణ్, నవీనా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో నేల ఆరోగ్యం, భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనాల తీయూ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్, వ్యవసాయాధికారులు ఇందుమతి, యశ్వంత్, సైన్స్ టీచర్ శైలజ తదితరులు ఉన్నారు.

మాదక ద్రావ్యాలకు దూరంగా ఉండాలి

ఎమ్మిగనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వల్ల కలిగే నష్టాలపై కడిమెట్ల గ్రామ ప్రజలకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన కల్పించారు. మంగళవారం సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యునిట్ ఆధ్వర్యంలో కడిమెట్ల గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. 1నుంచి 7వ తేదివరకు జరిగే క్యాంపులో మాదకద్రవ్యాలు, ప్లాస్టిక్ వినియోగంతో పాటు ఇతర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించనున్నారు. అలాగే గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రఘు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పూడిక తీశారు.. మూయడం మరిచారు..



మూయకుండా ఆలాగే వదిలేసిన మ్యాన్‌హోల్

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి సమిపంలో మెయిన్ రోడ్డుకు పక్కనే భారీ వర్షానికి పూడిక అడ్డుపడడంతో దానిని తొలగించడానికి కాలువ మ్యాన్ హోల్‌పై కప్పును తీసి పూడికను తొలగించారు. అయితే పూడిక తీసిన తర్వాత దాని పై కప్పును మాత్రం మూసివేయడం మరచిపోయారు. అదే దారిలో నారాయణ స్కూల్, శ్రీచైతన్య, సిదార్థ కాలేజీలకు విద్యార్థులు నిత్యం రాక పోకలు కొనసాగిస్తుంటారు. మునిసిపల్ అధికారులు కాలువ పై కప్పును మూసివేసి, నీరు లీకేజ్ కాకుండా చర్య లు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టును నిర్మించరూ?

కోసిగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మార్కెండేయ దేవాలయం సమీపంలో తేరుబజారు ఎదురుగా ఉన్న గడ్డం కాలనీలో కల్వర్టు బండలు పడిపోవడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు అదే మార్గాన రాకపోకలు సాగిస్తున్నాయి. పాటు పలు శుభకార్యాలకు, దేవాలయం వెళ్లేవారు అదే రోడ్డు మార్గంలో వెళ్తున్నారన్నారు. ముఖ్యంగా కోసిగిలో బట్టల దుకాణాలు అధికంగా అదే కాలనీలో ఉండడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కల్వర్టు మీద బండలు గానీ, సీసీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా కల్వర్టు రోడ్డు

నీడ కరువాయె..



రోడ్డుపై ఎండకు నిలబడిన ప్రయాణికులు

గోనెగండ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల లోని బస్‌సెల్టర్ కు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో ప్రయాణికులు మండుటెండలో సైతం ఆరుబయట బస్సు వచ్చేవరకు వేచి ఉండాల్సిందే. ఇదే పరస్థితి మండలంలోని పలు గ్రామాలలో ఉంది. మండలంలో వేముగోడు, పుట్టపాశం, హెచ్ కైరవాడి, పెద్దమరివీడు, అలువాల, పెద్దనేలటూరు, లింగందిన్నె స్టేజి గ్రామాలలో బస్‌సెల్టర్‌లు ఉన్నప్పటికీ బస్‌సెల్టర్ ఉన్న చోట బస్సు ఆగదు, బస్సు ఆగిన చోట బస్‌సెల్టర్ ఉండదు. ఇదీ మండలంలోని పరస్థితి. మండల కేంద్రమైన గోనెగండ్లలో ప్రయాణికులు పరిస్థితి మరీ దారుణం ఉంది. ఎండ కాలంలో ఎండలో నిటబడాలి, వర్షాకాలంలో చెట్లకిందనో హోటళ్లలోనే తలదాచుకోవాల్సిన దుస్థితి.

ముమ్మరంగా తాగునీటి పైప్‌లైన్ పనులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో 15వ ఆర్థిక సంఘం రూ. 3కోట్ల నిధులతో తాగునీటి పైప్‌లైన్ పనులను మున్సిపల్ అధికారులు మొదలు పెట్టారు. ఈ పనులు స్థానిక న్యూ ఇందిరా నగర్‌లో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ రోడ్ల వెంబడి పైప్‌లైన్లను వేస్తున్నారు. పైప్‌లైన్ పనులను మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డి మంగళవారం పరిశీలించారు. పనులు నాణ్యతయుతంగా, వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ సీరజ, సిబ్బంది ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఇనుప కడ్డీలను తొలగించండి



డీటీ వీరేంద్రగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్ననాయకులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం ప్రధాన ముఖద్వారం వద్ద ప్రమాదకరంగా ఉన్న ఇనుప కడ్డీలను తొలగించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా నాయకులు సత్యన్న, బాలరాజులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వీరేంద్రగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఎన్ఆర్ఈజీఎస్, ఐసీడీఎస్, వ్యవసాయ శాఖ కార్యాలయం, ట్రెజరరీ, ఎక్సైజ్ కార్యాలయాలు ఉన్నాయన్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వస్తుంటారన్నారు.